ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 17 మే 2024



ఎన్నికలు కాస్ట్లీ గురూ..!

- జిల్లాలో ఎన్నికల ఖర్చు రూ.500 కోట్ల పైమాటే
- ఓటుకు రూ.1000 నుంచి 3 వేలు
- ఓటర్లతో పాటు నేతలనూ కొనుగోలు చేశారు...
- మద్యం, డబ్బు పంపిణీలో అధికార పార్టీదే హవా..
- చీరలు, కానుకల పంపిణీ హోరు..
- ఖర్చులో వెనుకపడ్డ టీడీపీ

మాకు ఇచ్చేది వారి చేతి నుంచి కాదు కదా.. మా డబ్బే కదా.. మమ్మల్ని పిండేసి వివిధ రూపాల్లో సంపాదించిన డబ్బునే తిరిగి మాకు పంపిణీ చేస్తున్నారు.. తీసుకుంటే తప్పేంటి అనే స్థితికి ఓటర్లు వచ్చేశారు. ఒకప్పుడు ఓట్లకు డబ్బు తీసుకునేవారు కాదు.. కానీ రాను రాను రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లను డబ్బు తీసుకుని ఓట్లేసేలా మార్చేస్తున్నారు. దీంతో ఓటర్లు కూడా డబ్బు తీసుకుంటే తప్పేంటి అనే భావనకు వచ్చేశారు. దీంతో జిల్లాలో ఒక్కో ఓటుకు రూ.1000 నుంచి 3 వేల రూపాయలు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన జిల్లాలో దాదాపు ఎన్నికల ఖర్చు రూ.500 కోట్లు దాటినట్లు అంచనా వేస్తున్నారు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): గత 75 రోజులుగా ఎక్కడ చూసినా ఎన్నికల హడావుడే. ఏ ఊర్లో చూసినా.. ఓట్ల గురించే చర్చ. రచ్చబండలు, పొలాలు, టీ బంకులు, టిఫిన్ సెంటర్లు, కూరగాయల మార్కెట్లు, ఇలా ఒకటేమిటి నలుగురు గుమికూడిన ప్రతిచోటా... ఓట్ల గురించి మాట్లాడుకోవడాలే.. ఏ పార్టీ ఎంత ఇస్తుంది..? ఏమేమి కానుకలు ఇస్తుంది..? అంటూ ఓటర్ల ఎదురుచూపులే. ఈ కబుర్ల మధ్య.. ఎన్నికలు ముగిసిపోయాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా చర్చలే.. అయితే ఇప్పుడు చర్చల్లో ముఖ్యాంశాలు.. ఓటుకు ఏ పార్టీ ఎంత ఇచ్చింది.? ఓటర్లకు పంచిన డబ్బుతో పాటు, కానుకలు వంటివి కలుపుకుని నియోజకవర్గంలో ఎంత ఖర్చు చేసింది? ఏ పార్టీ ఎక్కువగా పంచిపెట్టింది. ఏ పార్టీ వెనుక పడింది? ఈ నేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో రాజకీయ పార్టీలు పెట్టిన ఖర్చు సుమారు రూ.500 కోట్ల పైమాటే.. అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

జిల్లాలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. గెలుపే లక్ష్యంగా బరిలో ఉన్న రాజకీయ పార్టీలు తమ శక్తి మేర ఓట్లు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. చీరలు, కుక్కర్లు పంపిణీ చేశాయి. మద్యం, చికెన్ సైతం పలుచోట్ల ఓటర్లకు పంచిపెట్టాయి. దీంతో సుమారు 50 రోజుల పాటు పల్లెల్లో పండుగ వాతావరణమే కనిపించింది. చాలా చోట్ల ప్రచారానికి కూలీలను పిలిపించుకున్నారు. రోజంతా ప్రచారంలో పాల్గొంటే.. రూ.500, టిఫిన్, మధ్యాహ్నం బిరియానితో పాటు మందు అదనం. ఇలా అభ్యర్థులు విపరీతంగా ఖర్చులు పెట్టారు.

ఏ పార్టీ ఎంత డబ్బు పంచిందంటే..?

ఓటర్లకు డబ్బు పంచడమే ప్రధాన ఖర్చుగా చెప్పుకోవచ్చు. ప్రధానంగా వైసీపీ, తెలుగుదేశం, జనసేన, బీజేపీలు ఓటర్లకు డబ్బు పంచి పెట్టినట్లు పలువురు పేర్కొంటున్నారు. వైసీపీ రూ.3 వేలు ఇవ్వగా.. టీడీపీ రూ.1500 నుంచి రూ.2 వేలు ఇచ్చినట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల వారీగా ఒకసారి చూస్తే తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైసీపీ ఓటుకు రూ.2 వేలు పంచినట్టు సమాచారం. తెలుగుదేశం పార్టీ వేయి రూపాయలు ఇచ్చింది. మదనపల్లెలో వైసీపీ రూ.2 వేలు, టీడీపీ వేయి రూపాయలు ఇచ్చారు. పీలేరు నియోజకవర్గంలో వైసీపీ రూ.2 వేలు, టీడీపీ కూడా రూ.2 వేలు ఇచ్చారు. రాయచోటిలో వైసీపీ రూ.2 వేలు, టీడీపీ రూ.1500 ఓటర్లకు పంచారు. రాజంపేటలో వైసీపీ రూ.3 వేలు, టీడీపీ రూ.1000 ఇచ్చారు. రైల్వేకోడూరులో వైసీపీ, టీడీపీలు రూ.2 వేలు పంచారు. సగటున ప్రతిపార్టీ 60 శాతం మందికే డబ్బు పంచినట్లు సమాచారం.

రూ. 500 కోట్ల పైమాటే..

జిల్లాలో పార్టీలు పెట్టిన ఖర్చును చూస్తే.. ఆరు నియోజకవర్గాలలో ఒక్కో నియోజకవర్గంలో వైసీపీ సగటున రూ.35 కోట్ల వరకు ఖర్చు చేసింది. (ఓటర్లకు పంచిన డబ్బు చీరలు, ఇతర కానుకలు కలిపి) తెలుగుదేశం పార్టీ నియోజకవర్గంలో సగటున రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు ఖర్చు చేశారు. (ఇందులోనే బీజేపీ ఎంపీ అభ్యర్థి ఖర్చు కూడా కలిపి) ఈ లెక్కన ప్రధాన పార్టీలైన వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీలు కలిపి రూ.500 కోట్లకుపైగా ఖర్చు చేసినట్లు చెబుతున్నారు.

డబ్బు పంపిణీలో టీడీపీ వెనుకంజ

ఓటర్లకు డబ్బు పంపిణీలో అధికార పార్టీ వైసీపీ తన హవా కొనసాగించింది. వలంటీర్ల సహకారంతో ఎన్నికలకు వారం రోజుల ముందుగానే దాదాపు ఇంటింటికీ డబ్బు పంపిణీ చేశారు. ఐదేళ్లుగా ఇసుక, మద్యం, ఇతర అక్రమమార్గాల ద్వారా సంపాదించిన సొమ్ముతో అధికార పార్టీ ఖర్చుకు వెనుకాడలేదని సమాచారం. దీంతో ఎంతైనా ఖర్చు చేయండి.. ఓట్లు కావాలి.. అనే లక్ష్యంతో అధికార పార్టీ డబ్బు వెదజల్లినట్లు తెలుస్తోంది. అయితే ఇదే సమయంలో జిల్లాలో చాలా నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీ డబ్బు పంపిణీలో వెనుకబడిపోయినట్లు సమాచారం.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హౌస్ అరెస్ట్

- ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ దాడులు చేస్తోంది
- మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, మే 16: ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా దాడులకు తెగపడుతున్నారని, ఈ అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి వచ్చి రాత్రిళ్లు క్యూలైన్‌లో నిల్చొని టీడీపీకి ఓట్లు వేశారని రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ వారే దాడులు చేసి తనను హౌస్ అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. బుధవారం రాత్రి రాయచోటిలో మార్కెట్‌యార్డు చైర్మన్, వైసీపీ నాయకుడు వండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై చేసిన దాడిని టీడీపీపై రుద్దడం సబబు కాదన్నారు. బీసీలతో ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ బీసీలపై దాడులు చేయదని, 20 సంవత్సరాల కాలంగా భూదందాలు, ఎర్రచందనం, డ్రగ్స్, స్మగ్లింగ్ వ్యవహారాల్లో ప్రమేయం ఉన్న వ్యక్తి వండాడి వెంకటేశ్వర్లు అని ఆరోపించారు. అలాంటి వ్యక్తిపై ఎవరో దాడి చేస్తే టీడీపీ చేసిందని నిందమోపడం ఏంటని నిలదీశారు. సంవత్సర కాలం క్రితం తన కుమార్తె వివాహం జరిగినా ఎన్నికల్లో తమ పరిధిలోని మహిళలకు వైసీపీకి ఓట్లు వేయాలని చీరలు పంచి పెట్టాడని, ఎన్నికల రోజు టీడీపీ ఏజెంట్లను సైతం ప్రలోభాలకు గురి చేయాలని చూసినా వారు వినకపోవడంతో వారిని కూడా బెదిరించిన వ్యక్తి వెంకటేశ్వర్లు అని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకొని వైసీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఓ సీఐ స్థాయి వ్యక్తిని అడ్డుపెట్టుకుని తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు, ఏజెంట్లను బెదిరించి తద్వారా ఎన్నికల్లో నెగ్గాలని స్థానిక వైసీపీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చూస్తున్నారన్నారు.

రాజకీయ లబ్ధి కోసం హిందూ, ముస్లింల మధ్య చిచ్చు

15 సంవత్సరాలు రాయచోటి ప్రజలను మోసం చేస్తూ కేవలం తన రాజకీయ లబ్ధి కోసం అన్నదమ్ములు లాంటి హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టి రాజకీయం చేస్తూ ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వ్యక్తి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అని విమర్శించారు. తామెంతో పేరుగాంచిన వైసీపీ నాయకులమనే చెప్పుకుంటున్న వారి సొంత మండలాల్లోని ప్రతి బూత్‌లో పూర్తి స్థాయిలో టీడీపీ ఏజెంట్లను నియమించడాన్ని వైసీపీ శ్రేణులు జీర్ణించుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. శ్రీకాంత్‌రెడ్డి, తన అనుచరుల కారణంగా చాలా మంది టీడీపీ కార్యకర్తలు మానసికంగా, ఆర్థికంగా, శారీరకంగా హింసకు గురయ్యారన్నారు. పోలీసులు, ఎన్నికల వ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని, మేము న్యాయపరంగా పోరాడుతాం అని మండిపల్లి అన్నారు. రానున్నవి మంచిరోజులని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సహనం పాటించాలన్నారు. రాష్ట్రంలో, రాయచోటిలో రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని వైసీపీ నేతలు, వండాడి వెంకటేశ్వర్లు ద్వారా నష్టపోయిన ప్రతి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాంప్రసాద్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేయడంతో వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆయన నివాసానికి చేరుకుని ఆయనకు మద్దతు పలికారు.



మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన రాయచోటి రూరల్ సీఐ తులసీరాం, ఎస్ఐ రమేశ్‌బాబు

టీకా కేంద్రాల తనిఖీ : డీఎంహెచ్‌వో

రాయచోటి టౌన్, మే 16: వయోజన టీబీ (క్షయ) టీకాల కేంద్రాలను గురువారం జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారి (డీపీఎంవో) డాక్టర్ రియాజ్‌బేగ్, డీఎస్ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంతో పాటు దేవళంపల్లె పీహెచ్‌సీ పరిధిలోని కుర్నూతల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నిర్వహిస్తున్న వయోజన క్షయ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. చెక్లిస్ట్ ప్రకారం టీకాల కేంద్రంలో ప్రోటోకాల్ ప్రకారం ఉండాల్సిన ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. లబ్ధిదారులకు టీబీ వ్యాక్సిన్ ఎందుకు ఇస్తున్నాము. ఈ వ్యాక్సిన్ వల్ల ఏ జబ్బును నివారణ చేయవచ్చు. ఎప్పుడెప్పుడు పరిశీలన చేసుకోవాలి. ఒకవేళ ఏమైనా వ్యాక్సిన్ వల్ల ప్రతికూల పరిస్థితి ఏర్పడితే ఎవరిని, ఎప్పుడు సంప్రదించాలి అనే నాలుగు రకాల సమాచారాన్ని తప్పనిసరిగా రోగులకు చెప్పాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రతి గురువారం టీకా దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఈ టీకాకు అర్హులైన వారిని హెడ్‌కౌంట్ సర్వే చేసి గుర్తించామని, వారందరినీ ప్రోత్సహించి టీకాలు వేసి టీబీ ముక్త్‌భారత్ సాధనే లక్ష్యంగా వైద్య సేవలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తపల్లి యూపీహెచ్‌సీ వైద్యులు, దేవళంపల్లె, పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీతో విత్తనాల పంపిణీ

- జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

రాయచోటి(కలెక్టరేట్), మే 16: జిల్లాలోని రైతులకు సబ్సిడీపై వేరుశనగ, పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రైతులందరికీ 40 శాతం సబ్సిడీపై వేరుశనగ, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. జనుము 2578 క్వింటాళ్లు, జీలుగ 2492 క్వింటాళ్లు, పిల్లిపెసర 76 క్వింటాళ్లు మంజూరయ్యాయన్నారు. వేరుశనగ కే-6 రకం 35,323 క్వింటాళ్లు, నారాయణి 18,046 క్వింటాళ్లు, టీసీజీఎస్ 900 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి 1114 క్వింటాళ్లు జిల్లాకు వచ్చాయన్నారు. రైతులందరూ తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి కావాల్సిన విత్తనాలు ఎంపిక చేసుకుని తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని మండల వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఈ విషయాన్ని రైతులకు తెలియజేసి రైతుల పేర్లు నమోదు చేయాలన్నారు.

మా ట్రాక్టర్లనే పట్టుకుంటారా..!

- రెవెన్యూ సిబ్బందిపై తిరగబడ్డ వైసీపీ నాయకులు

గుర్రంకొండ, మే 16: మీకెంత ధైర్యం.. మా ట్రాక్టర్లనే పట్టుకుంటారా.. మా జోలికి వస్తే ఎవరినైనా వదిలిపెట్టమని వైసీపీకి చెందిన ఇసుకాసురులు మండలంలోని రామానాయుని చెరువు వద్ద రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం తిరగబడ్డారు. దీంతో రెవెన్యూ శాఖలో పనిచేసే చిన్నస్థాయి ఉద్యోగులు భయపడుతున్నారు. ఈ క్రమంలో ఇసుక వ్యాపారులు ట్రాక్టర్లలో ఇసుకను లోడ్ చేస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఆంధ్రజ్యోతిలో గురువారం 'ఇసుకను తోడేస్తున్నారు' అన్న శీర్షిక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈక్రమంలో తరిగొండ రామానాయునిచెరువులో గురువారం ఉదయం 7గంటల సమయంలో సుమారు 20 ట్రాక్టర్లు ఇసుకను లోడ్ చేస్తునట్లు తహసీల్దార్ శ్రీనాథ్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ తరిగొండ వీఆర్వో రెడ్డిశేఖర్‌కు సమాచారం ఇచ్చి ట్రాక్టర్లను సీజ్ చేయాలని సూచించారు. ఈ క్రమంలో వీఆర్వో గ్రామంలో అందుబాటులో ఉన్న వీఆర్ఏను రామానాయుని చెరువు వద్దకు పంపారు. చెరువులో ఇసుకను లోడ్ చేస్తున్న రెండు ట్రాక్టర్లను వీఆర్ఏ పట్టుకున్నారు. దీంతో ఇసుకాసురులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మా ట్రాక్టర్లనే పట్టుకుంటావా.. వదిలేయ్... లేకుంటే ఇబ్బందులు పడతావంటూ వీఆర్ఏను బెదిరించినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. అనంతరం అక్కడకు చేరుకున్న వీఆర్వో రెడ్డిశేఖర్ రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రామానాయుని చెరువులో అక్రమంగా ఇసుకను తరలిస్తే ఎటువంటి వారైనా చర్యలు తీసుకుంటామని వీఆర్వో తెలిపారు.

20 నుంచి ఏపీఆర్‌జేసీ కౌన్సెలింగ్

- రాయలసీమ కన్వీనర్ డాక్టర్ చెన్నకేశవులు



పీలేరు, మే 16: ఏపీఆర్‌జేసీ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలుర ప్రవేశాల కోసం ఈనెల 20వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ఏర్పాటు చేసినట్లు రాయలసీమ కన్వీనర్ డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. రాయలసీమ జిల్లాల్లోని విద్యార్థులకు కేవీపల్లె మండలం గ్యారంపల్లెలోని ఏపీఆర్‌జేసీ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని ఆయన తెలిపారు. ఎంపీసీ గ్రూపునకు ఈనెల 20వ తేదీ, బైపీసీకి 21న, ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు 22న కౌన్సెలింగ్ ఉంటుందని ఆయన వివరించారు. కౌన్సెలింగ్ కోసం విద్యార్థులను 1:5 నిష్పత్తిలో పిలుస్తున్నామని, కాల్‌లెటర్ అందిన వారు బాలురు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, తమకు నిర్దేశించిన రోజుల్లో ఉదయం 9 గంటలకల్లా కళాశాలలో ఉండాలని ఆయన తెలిపారు. కాల్ లెటర్లను ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని ఆయన సూచించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్స్ కాపీలు తెచ్చుకోవాలని ఆయన తెలిపారు.

పీలేరులోని రైల్వే బ్రిడ్జి కింద నిలిచిపోయిన వర్షపు నీరు



రైల్వే బ్రిడ్జి నుంచి కాలువలోకి నీళ్లు వెళ్లకుండా అడ్డుగా ఉన్న దిమ్మెలు



సంతగేటుకు వెళ్లే మార్గంలో మ్యాన్ హోల్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తీస్తున్న పారిశుధ్య కార్మికుడు



- అశాస్త్రీయంగా రోడ్లు, కాలువల నిర్మాణం
- కాలువల్లో కాకుండా రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండు

చినుకు పడిన వేళనే చూడాలి..

పీలేరులో ఇంజనీరింగ్ 'అద్భుతాలు'!

పీలేరు, మే 16: 'అలిగిన వేళనే చూడాలి గోకులకృష్ణుడి అందాలు' అన్న సినీ గేయానికి పేరడిగా 'చినుకు పడిన వేళనే చూడాలి పీలేరు అందాలు, అందులోని ఇంజనీరింగ్ 'అద్భుతాలు' అంటూ పీలేరు వాసులు పాడుకుంటున్నారు. పట్టణంలోని అధిక శాతం ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణంలో శాస్త్రీయ కోణం లోపించడంతో కాలువల్లో పారాల్సిన మురుగు రోడ్లపై ప్రవహిస్తుంటే చేసేదిలేక పట్టణ వాసులు అలా పాడుకోవాల్సి వస్తోంది. పట్టణంలో పారిశుధ్యం అభివృద్ధి చేయడానికి లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నామని గొప్పలు చెప్పుకునే పాలకులు, పంచాయతీ పాలకవర్గం మురుగునీటి కాలువల నిర్మాణంలో కనీస జాగ్రత్తలు కూడా పాటించకపోవడంతో రోడ్లపై ప్రవహించడం, ఇళ్లలోకి రావడం, ఇళ్ల మధ్య పేరుకుపోవడం వంటి సమస్యలతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

లోపించిన శాస్త్రీయ కోణం...


ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో పీలేరుది ప్రథమ స్థానం. మేజర్ గ్రామ పంచాయతీగా ఉంటున్నప్పటికీ మున్సిపాలిటీకి ఉండాల్సిన హంగులన్నీ ఉన్నాయి. పట్టణంలోని ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాలు కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన పేరుతో పెద్దఎత్తున మురుగునీటి కాలువలు, సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు వాటి నిర్మాణంలో మాత్రం శాస్త్రీయ కోణాన్ని పట్టించుకోవడం లేదు. ఎత్తు ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి నీరు ప్రవహించేలా నిర్మించాల్సిన మురుగునీటి కాలువలను రివర్స్‌లో నిర్మించేశారు. దీంతో మురుగునీరు రోడ్డుపైకి వచ్చేస్తోంది. దీంతో సిమెంటు రోడ్లు చిన్నపాటి మడుగులను తలపిస్తున్నాయి. పీలేరు పట్టణంలో గురువారం మధ్యాహ్నం కేవలం గంటపాటు కురిసిన వర్షానికే పట్టణ రహదారి అయిన్ ఎల్‌బీఎస్ రోడ్డు, సంతగేటు ప్రాంతం, ఆర్టీసీ బస్టాండు, కట్టుకాలువ వీధి నుంచి కొత్తపల్లెకు వెళ్లే రోడ్డు, మదనపల్లె టర్నింగ్, తిరుపతి రోడ్డులోని పాత సబ్‌ట్రెజరీ కార్యాలయ వీధి, ఎస్వీ డీలక్స్ రోడ్డు, రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయి ఆ ప్రాంతాలన్నీ బురదమయంగా మారాయి.



క్యాంటీన్‌లోకి మురుగునీరు రాకుండా వాటర్ ప్యాకెట్ల బస్తాలను అడ్డుగా వేసుకున్న నిర్వాహకులు

చెరువును తలపిస్తున్న పీలేరు ఆర్టీసీ బస్టాండు

ప్రభుత్వ కార్యకలాపాల్లో లోపించిన పర్యవేక్షణ, శాస్త్రీయ కోణానికి పీలేరు ఆర్టీసీ బస్టాండు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా పీలేరు బస్టాండు చెరువులా మారిపోతోంది. పట్టణంలో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి బస్టాండు పొరుగున ఉన్న ఆర్టీసీ నల్లగుట్ట, వారపు సంత ప్రాంతాల్లోని మురుగునీటి కాలువలు నిండిపోవడంతో ఆ నీరంతా బస్టాండులోకి చేరింది. బస్టాండులోని మురుగునీటి కాలువలు పూర్తిగా పూడిపోయి ఉండడంతో నీరంతా అక్కడే నిలిచిపోయింది. దీంతో బస్సులు ఎక్కేందుకు, దిగేందుకు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దుకాణాల్లోకి కూడా నీరు ప్రవేశించడంతో దుకాణదారులు కూడా తమ దుకాణాలను మూసివేయాల్సి వచ్చింది. ప్రాంగణంలోని క్యాంటీన్‌లోకి మురుగునీరు ప్రవేశించకుండా నిర్వాహకులు వాటర్ ప్యాకెట్ల బస్తాలను అడ్డుగా పెట్టుకున్నారు. ఏడాదిన్నర క్రితం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ప్రకటించిన అండర్‌గ్రౌండ్ కాలువల నిర్మాణ ఊసు ఆ తరువాత వినిపించలేదు. స్థానిక అధికారులకు అటు ప్రయాణీకులు, దుకాణదారులు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లేనిదే తాము ఏమీ చేయలేమంటూ నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. గురువారం కూడా ఆయా ప్రాంతాల్లో స్థానిక గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది వర్షంలో తడుస్తూనే ఉపశమన చర్యలు చేపట్టడంతో ఆయా ప్రాంత వాసులు ఊపిరి పీల్చుకున్నారు.



చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండు



బస్టాండులోని క్యాంటీన్ ముందు నిలిచిపోయిన మురుగునీరు

వైభవంగా గంగమ్మ జాతర

- మొక్కులు తీర్చుకున్న భక్తులు
- వేలాదిగా తరలివచ్చిన జనాలు

రైల్వేకోడూరు, మే 16: పట్టణంలో గురువారం జరిగిన గంగమ్మతల్లి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతరకు తిరుపతి, కడప, చిత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, తమిళనాడు, కర్ణాటక, రైల్వేకోడూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులు గంగమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. బుధవారం పూలపల్లకిని అంకాళమ్మ ఆలయం వద్దకు తీసుకుని వచ్చారు. అక్కడ గంగమ్మ తల్లి ప్రతిమను మట్టితో తయారు చేశారు. అమ్మవారి నగలను తీసుకుని వచ్చి అలంకరించారు. అక్కడి నుంచి గంగమిట్ట వరకు గంగమ్మతల్లిని ఊరేగించారు. ఊరేగిస్తుండగానే అమ్మవారికి పొట్టేళ్లు, మేకపోతులు, కోళ్లను భక్తులు సమర్పించారు. మొదట బలిజ వీధిలో ముద్దలు పెట్టి పూజలు చేశారు. ఉదయం 5 గంటలకే జాతర ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. తెల్లవారే సరికి గంగమ్మతల్లినిని గుడిలోకి తీసుకుని వెళ్లారు. అప్పటి నుంచి శుక్రవారం ఉదయం వరకు దర్శనాలు కల్పిస్తారు. తర్వాత నిమజ్జనం చేస్తారు. అన్నదానాలు, మజ్జిగ తదితర వాటిని భక్తులకు పంపిణీ చేశారు.



గంగమ్మతల్లిని ఊరేగిస్తున్న దృశ్యం



గంగమ్మ జాతరకు తరలివచ్చిన జనాలు

బ్రహ్మంగారి ఆరాధనకు ప్రత్యేక బస్సులు

మైదుకూరు/బద్వేలు, మే 16: బ్రహ్మంగారిమఠంలోని బ్రహ్మంగారి ఆరాధనకు మైదుకూరు డిపో నుంచి 22 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం నుంచి 19వ తేదీ వరకు మైదుకూరు నుంచి మిట్టమానుపల్లె మీదుగా 7 బస్సులు, మల్లేపల్లె మీదుగా 15, జ్యోతి క్షేత్రానికి 2 బస్సులు ఏర్పాటు చేశామని ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

బద్వేలు నుంచి... : బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం బ్రహ్మంగారి మఠానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు బద్వేలు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 19వ తేదీ వరకు జరిగే ఆరాధనోత్సవాలు పురస్కరించుకుని బద్వేలు బస్ డిపో నుంచి 12 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కావున ఈ అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అక్రమ కట్టడాల కూల్చివేతకు హైకోర్టు ఆదేశాలు

ప్రొద్దుటూరు, మే 16: కొత్తపల్లె పంచాయితీలోని సర్వే నెంబరు 411, 213-బిలో కాల్వకు సంబంధించి స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను రెండు నెలల్లోగా కూల్చివేయాలని హైకోర్టు కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు కలెక్టరుకు ఉత్తర్వులు జారీ అయ్యాయని హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కరుణాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వ స్థలం కబ్జా చేసి కట్టడాన్ని నిర్మించడంపై కలెక్టర్ సహా ఆర్డీవో, తహసీల్దారు, పంచాయతీ కార్యదర్శికి సైతం ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అందువల్లే వారందరినీ ప్రతివాదులుగా చేర్చుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేశామన్నారు. కోర్టు విచారించి అక్రమ కట్టడాన్ని రెండు నెలల్లోపు తొలగించాలని ఆదేశించిందన్నారు. కాల్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టింది అధికార వైసీపీకి చెందిన కౌన్సిలర్ అని అందుకే అధికారులు చర్యలు తీసుకోలేదని కరుణాకర్ ఆరోపించారు.


సాంకేతిక లోపంతో ఆర్టీఏ సేవలకు అంతరాయం

సికెదిన్నె, మే 16: సాంకేతికలోపం కారణంగా సారథి పోర్టల్ డేటాబేస్‌కు అంతరాయం ఏర్పడినట్లు ఉపరవాణా కమిషనర్ మీరాప్రసాద్ తెలిపారు. సాంకేతికలోపం వలన 16వ తేదీ గురువారం నుంచి 18వ తేదీ వరకు సారథి పోర్టల్ డేటాబేస్ అందుబాటులో ఉండదని, లెర్నింగ్ లైసెన్స్ డ్రైవింగ్ లైసెన్స్ సేవలు నిలిపివేశామని, 18వ తేదీ ఉదయం 10 గంటల తర్వాత సేవలు యథావిధిగా అందుబాటులోకి వస్తాయని దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

ఆరుగురు నిందితుల అరెస్టు

రాయచోటి టౌన్, మే 16: పట్టణంలోని గాలివీడు రోడ్డులోని లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేసిన ఆరుగురిని రాయచోటి అర్బన్ పోలీసులు గురువారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో వైసీపీకి చెందిన వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఈనెల 15 రాత్రి వెంకటేశ్వర్లు ఇంటిపైన కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఇంటి ప్రహరీగోడకు ఉన్న సోలార్‌వైర్లను కత్తిరించి ఇంట్లోకి ప్రవేశించి అక్కడ ఉన్న జీపు అద్దాలు, కుర్చీలు, లైట్లు పగులకొట్టారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు రాయచోటి డీఎస్పీ రామచంద్రారావు, సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో దాడికి పాల్పడిన వారిలో అరుగురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితులను 14 రోజుల రిమాండ్ విధించారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కృష్ణారావు హెచ్చరించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు నీటిలో పడి యువకుడు మృతి



వల్లూరు, మే 16: మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద నీటిలో పడి యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... కడప బీకేఎం స్ట్రీట్‌కు చెందిన మోహనసాయి (21) తన స్నేహితులతో కలిసి గురువారం మధ్యాహ్నం సరదాగా ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. దీంతో గమనించిన స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో అక్కడున్న కొంతమంది వెతికినా కనిపించలేదు. కొద్ది సేపటికి మళ్లీ వెతకగా మృతదేహం బయటపడింది. మోహన్‌సాయి బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి కళ్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్టు

మైదుకూరు, మే 16: చాపాడు మండలం విశ్వనాథపురంలో పోలింగ్ ఏజెంట్‌గా కూర్చున్న భూమిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డిపై దాడి జరిగిన కేసులో గురువారం ముగ్గురిని అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం మైదుకూరులో చంద్ర ఓబుళరెడ్డిపై బీరు సీసాలతో దాడి చేసిన ఘటనపై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, చాపాడు మండలం విశ్వనాథపురం వాసులు కార్తీక్‌రెడ్డి, బొచ్చు సుబ్బారెడ్డి, ఇల్లూరి సుబ్బారెడ్డిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపెట్టగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మస్తాన్ తెలిపారు.

సచివాలయ సర్వేయర్ ఇంట్లో చోరీ

ఏడు తులాల బంగారు నగలు అపహరణ

కడప క్రైం, మే 16: కడప నగరం అంబాభవానీ నగర్‌లో నివశిస్తున్న సర్వేయర్ ప్రేమ్‌కుమార్ ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు అపహరించినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... ప్రేమ్‌కుమార్ అంబాభవానీ నగర్‌లోని సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 13వ తేదీ కుటుం బ సభ్యులతో కలిసి ప్రొద్దుటూరుకు వెళ్లి తిరిగి గురువారం వచ్చారు. దొంగలు ఇంట్లో పడి ఏడు తులాల బంగారు నగలు అపహరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఝరికోన సాగునీరు అందేనా..?

- ప్రాజెక్టులో నీళ్లున్నా రైతులకు ఫలితం సున్నా
- కాలువల నిర్మాణం కోసం రూ.42.25 కోట్లు ప్రకటించిన జగన్
- ఐదేళ్లయినా ఆ ఊసే లేదు
- ఇదీ ఝరికోన పరిస్థితి

ఝరికోన ప్రాజెక్టు ఒకప్పుడు చిత్తూరు, కడప జిల్లాల పరిధిలో ఉండేది. జిల్లాల పునర్విభజన తరువాత ఇప్పుడు అన్నమయ్య జిల్లాలోనే ఉంది. అయినా దీనిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. మూడు మండలాల్లోని 5వేల ఎకరాలకు సాగునీరు, రెండు మండలాలకు తాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రాజెక్టులో నీరున్నా.. కాలువల్లేక ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందడం లేదు. ఏళ్లుగా రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.



నీటితో కళకళలాడుతున్న ఝరికోన ప్రాజెక్టు



నిలిచిపోయిన కాలువ పనులు

సంబేపల్లె, మే 16: బాహుదానదిపై నిర్మించిన ప్రాజెక్టు ఝరికోన. ఈ ప్రాజెక్టు పేరు చెప్పగానే గుర్తుకొచ్చే మండలం సంబేపల్లె. ఈ ప్రాజెక్టు సంబేపల్లె, కేవీపల్లె, సుండుపల్లె మండల ప్రజలు, కరువు రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని 2005లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి రూ.34 కోట్లతో 0.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. ఈ మూడు మండలాలకు 5 వేల ఎకరాలు సాగునీరు సంబేపల్లె, చిన్నమండెం మండలాలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా నిర్మించారు. 20 సంవత్సరాలు కావస్తున్నా ఒక్క ఎకరా పొలానికి కూడా సాగునీరు అందలేదు. ప్రాజెక్టు నిండినా రైతులకు ప్రయోజగనం చేకూరడం లేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం కొలువుదీరాక డిసెంబరు 25న రాయచోటి గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఝరికోన ప్రాజెక్టు ఇరిగేషన్ కాలువల నిర్మాణానికి రూ.42.25 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఇది కేవలం ప్రకటనలకే పరిమితం అయింది. దీంతో ఝరికోన కాలువల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం

రాయలసీమ కరువు జిల్లాల్లో అప్పటి ఉమ్మడి కడప జిల్లా ఒకటి. ఈ ప్రాంతంలో రైతులు ప్రతియేటా వర్షాలు కురవక పెట్టిన పంటలు పండక కరువు కాటకాలతో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇందులో సంబేపల్లె మండలం ఒకటి. 2005లో ఝరికోన ప్రాజెక్టు నిర్మాణానికి మొదటి విడత రూ.34 కోట్లతో మట్టికట్ట, తూము, అలుగు నిర్మాణాలను ప్రారంభించారు. సంబేపల్లె మండలంలో 1000 ఎకరాలు, సుండుపల్లె మండలంలో 2 వేల ఎకరాలు, కేవీపల్లె మండలంలో 2 వేల ఎకరాలకు సాగునీటితో పాటు.. చిన్నమండెం, సంబేపల్లె మండలాలకు తాగునీరు అందించే విధంగా ప్రాజెక్టు నిర్మాణం చేశారు. 2009లో ప్రాజెక్టు పనులు పూర్తిచేశారు. అనంతరం కాలువల నిర్మాణం చేపట్టేందుకు నిధుల కోసం ఎదురు చేశారు. అప్పటి నుంచి ప్రాజెక్టులో నీరు ఉన్నా చేపల పెంపకానికి తప్ప రైతులకు ప్రయోజనం జరగలేదు. 2012లో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కలకడ, కేవీపల్లె, కలికిరి మండలాలకు రూ.58 కోట్లతో గ్రావిటీ వాటర్ ద్వారా తాగునీటి స్కీములు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతవాసులకు తాగునీటికి మాత్రమే ఉపయోగపడుతోంది. ఈ నేపథ్యంలో 2019లో వైసీపీ ప్రభుత్వం కొలువుదీరాక.. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కుడి, ఎడమ కాలువల నిర్మాణం కోసం రూ.42.25కోట్లు మంజూరు చేసినట్లు అదే ఏడాది డిసెంబర్‌లో ప్రకటించారు. అయితే పనులు మాత్రం జరగలేదు. ఇప్పటికైనా కాలువల నిర్మాణం పూర్తి చేసి తమకు సాగునీరు అందించాలని సంబేపల్లె, చిన్నమండెం, కేవీపల్లె మండలాల ప్రజలు కోరుతున్నారు.



ఐదేళ్లవుతున్నా ఎందుకు పనులు చేయలేదు..



2019లో ఝరికోన కాలువలకు నిధులు మంజూరు చేస్తే ఇప్పటివరకు పనులు ఎందుకు చేయలేదో చెప్పాలి. భూగర్భజలం అడుగంటడంతో బోరుబావుల్లో నీళ్లు రావడం లేదు. పొలం తడవాలంటే కాలువల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.

- శ్రీహరి, పెద్దకోడివాండ్లపల్లె, సంబేపల్లె మండలం

నేటి నుంచి కన్నెలూరులో గంగజాతర

- *144 సెక్షన్ ఉంది... నిబంధనలు పాటించండి*
- *ప్రజలకు గ్రామ పెద్దల విజ్ఞప్తి*



మాట్లాడుతున్న గ్రామ పెద్ద మురళీధర్‌రెడ్డి తదితరులు

జమ్మలమడుగు, మే 16: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరులో ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు గంగజాతర ఆవుల పబ్బం మహోత్సవం విజయవంతం చేయాలని గ్రామ పెద్ద, న్యాయవాది మురళీధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి కన్నెలూరు గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరులతో వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకుని పోలీసు అధికారులు గంగమ్మ జాతరకు అనుమతి ఇచ్చేది లేదని తేల్చి చెప్పారన్నారు. అయినా గ్రామస్థులంతా కలిసి డీఎస్పీ కార్యాలయం వద్దకు, అర్బన్ పోలీసుస్టేషన్ సీఐ కరుణాకర్ వద్దకు వెళ్లి చేసిన విజ్ఞప్తి మేరకు ఎలాంటి సమస్యలు లేకుండా జాతర నిర్వహించుకుంటామని చెప్పడంతో అంగీకరించినట్లు వారు తెలిపారు. అయితే జాతర మూడు రోజుల్లో గ్రామస్థులు బంధువులను పిలుచుకోరాదని, రాజకీయ నేతలను పిలువరాదని, మద్యం ఉపయోగించరాదని, నిబంధనలు పెట్టారు. దీనికి గ్రామ ప్రజలు సమావేశం వద్దనే ఒప్పించారు. ఈ కార్యక్రమాలు ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా విజయవంతం చేసుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కమిటీ వారు, గ్రామస్థులు అంగీకరించారు. ఒకానొక దశలో కమిటీ పెద్దలు అన్ని పార్టీల నాయకులను కలిసి గంగ జాతర గురించి వివరించారు. పోలీసుల నిబంధనలను వివరిస్తూ జాగ్రత్తలు పాటించాలని తెలిపినట్లు వారు వివరించారు. దీంతో నాయకులు కూడా అంగీకరించారు. 17వ తేదీ ఉదయం 9 గంటల నుంచి గ్రామ దేవతలకు పూజలు చేయడం, 10 గంటల నుంచి బొల్లేవు గ్రామోత్సవం, అదేరోజు మధ్యాహ్నం అమ్మవారికి కలశ స్థాపన తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయి. అదేరోజు రాత్రి ఆలయం ఎదురుగా పాలేటి గంగకు బోనం సమర్పిస్తారు. 18వ తేదీ శనివారం ఉదయం నుంచి అమ్మవారి తమ్ముళ్ల వేషధారణ, పోతురాజులు గ్రామంలో తిరుగుట, నాగులకు పూజలు, రాత్రి గంగవేషం, గంగ కాటమ రాజుకథ చెబుతారు. 18వ తేదీ బోనాలతో గ్రామోత్సవం ముగుస్తుంది. ఈ ఉత్సవాల్లో గ్రామస్థులు గ్రామ పెద్దలు ఇచ్చిన నిబంధనలు పాటించాలని, పాటించకుంటే పోలీసు అధికారులు గ్రామస్థులపై చర్యలు తీసుకుంటారని గ్రామ పెద్దలు సమావేశంలో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, పార్థసారధి, నవనీశ్వరరెడ్డి, గజ్జెల లక్షుమయ్య, చంద్ర, రఘురామయ్య, వేణు, తదితరులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

28 నుంచి కోర్టులో గంగమ్మ జాతర

మదనపల్లె అర్బన్, మే 16: స్థానిక కోర్టులో వెలసిన కోర్టులో గంగమ్మ జాతరను ఈనెల 28, 29 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఆలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆలయకమిటీ కార్యదర్శి మార్పురి ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ కోర్టులో గంగమ్మ జాతరకు సంబంధించి గురువారం చాటింపు వేశామని తెలిపారు.

ఈ నెల 28వ తేదీ అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠ రాత్రి తిరుణాల, 29వ తేదీ పగలు తిరుణాల అంగరంగవైభవంగా నిర్వహిస్తామన్నారు. అదేరోజు రాత్రి వివిధ రకాల కళాకారులతో బళ్లారి డ్రమ్స్, చెక్కభజనలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారిని జలజిలో కలిపే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అదేవిధంగా జాతర పోస్టర్‌ను ఆలయంలో ఆలయకమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అమ్మవారి జాతరలో అధిక సంఖ్యలో పాల్గొనే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప పేర్కొన్నారు. కార్యక్రమాలను ఆలయకమిటీ ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి మార్పురి ప్రభాకర్ నాయుడు ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు, జోలెపాళ్యం కరుణాకర్‌నాయుడు, ఆలయ ప్రత్యేక ఆహ్వానితుడు జోలెపాళ్యం భవానీప్రసాద్, మార్పురి మహేష్, మార్పురి విక్కి, జోలెపాళెం దేవేంద్ర(చిన్ని), బోయపాటి శ్రీనివాసులునాయుడు, ఉపాండ్ల కృష్ణకుమారి, తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

విహారయాత్రకు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మే 16: వేసవి సెలవుల్లో విహారయాత్రకు మదనపల్లె ఆర్టీసీ నుంచి బస్సులు నడుపుతున్నట్లు వన్‌డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె వన్ డిపో నుంచి ఊటీ, మైసూరు ప్రదేశాలకు విహారయాత్ర నిమిత్తం సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. ఈ బస్సులు 20వ తేదీ రాత్రి 9 గంటలకు మదనపల్లెలో బయలుదేరి 21వ తేదీ ఉదయం ఊటీ చేరుకుంటుందని, ఆ రోజంతా ఊటీలో ఉండి 22వ తేదీ ఉదయం ఊటీ నుంచి బయలుదేరి మైసూరు చేరుకుని అక్కడ ప్రదేశాలను దర్శించిన అనంతరం సాయంత్రం బృందావన్ గార్డెన్స్‌లో లైటింగ్‌షో చూసుకుని రాత్రికి అక్కడ నుంచి బయలుదేరి 23వ తేదీ ఉదయం మదనపల్లెకు బస్సు చేరుకుంటుందన్నారు. పోనురాను ఒక్కరికి ఛార్జీ రూ.2800 మాత్రమే అన్నారు. యాత్ర ప్రియులు, ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు ఈ ఫోన్ నెంబర్లకు 7382875034, 7382876658, 9441646104, 9440249483 సంప్రదించాలని కోరారు.

బి.కొత్తకోటలో బాలుడు అదృశ్యం

బి.కొత్తకోట, మే16: బి.కొత్తకోట పట్టణంలోని పంజూరమ్మ వీధికి చెందిన ఓ బాలుడు అదృశ్యం అయినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. తన కుమారుడు దండు ఖుషివర్ధన్ (12) గురువారం ఉదయం నుంచి కనిపించలేదని తండ్రి మహేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామన్నారు. ఖుషివర్ధన్‌కు మతిస్థిమితం సరిగా లేదన్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు తండ్రి ఫోన్‌నెంబరు 6303624722 కు లేదా 9440900707 నెంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

దాడి కేసులో రిమాండ్‌కు నిందితురాలు

మదనపల్లె అర్బన్, మే 16: ఫిబ్రవరి నెలలో దారి విషయంగా ఇరువర్గాలు దాడి చేసుకున్న సంఘటనలో గంగాధర్‌పై దాడి చేసిన కేసులో నిందితురాలు సునీత (32)ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... స్థానిక చీకలగుట్టకు చెందిన గంగాధర్, సుజాత ఇరువర్గాలు దాడి చేసుకున్నారని అప్పట్లో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఈ కేసుకు సంబంధించిన సుజాతను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

23న ధర్మపథంలో పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, మే 16: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథంలో 23న (గురువారం) పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఉదయం ఆలయంలోని మూలవర్లకు అభిషేకాలు, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణవ్రత వేడుకలు, అభయాంజనేయ స్వామికి వడమాల, తోమాల సేవలు ఆకుపూజ, విశేష అలంకరణలు నడుమ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో.. స్వేచ్ఛాపతాకం

మైదుకూరు, మే 16: మైదుకూరు నియోజకవర్గంలో ఏ ఎన్నికలు జరిగినా అక్కడ అధికార పార్టీ నేతదే పెత్తనం. అక్కడ వారు చెప్పిందే శాసనం. ఎన్నిక ప్రక్రియ వచ్చే సరికి ఆ గ్రామాల్లో ఏకపక్షంగానే సాగేవి. ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు ఏజెంట్లను కూడా కూర్చోబెట్టేందుకు సాహసించరు. ఓటర్లు కూడా స్వచ్ఛందంగా ఓట్లు వేసే వారు కాదు. ఆ గ్రామాల్లో ప్రతిసారీ దాదాపుగా 98 శాతం ఓట్లు ఓకే పార్టీకి పడేవి. దీనికి భిన్నంగా ఈసారి స్వేచ్ఛాపతాకం ఎగిరింది. ప్రజాస్వామ్యబద్ధంగా పోలింగ్ ప్రక్రియ జరిగింది.

సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ వ్యూహంతో ముందుకెళ్లారు. నియోజకవర్గంలోని మైదుకూరు, చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, బి.మఠం మండలాల్లోని 27 సమస్యాత్మక, ఏకపక్ష గ్రామాలు ఉన్నట్లు గుర్తించారు. ఆ గ్రామాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో పోలింగ్ జరిగేలా చూడాలనుకున్నారు. ఇందుకోసం ఆ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో తమ పార్టీ తరుపున ఏజెంట్లను కూర్చోబెట్టాలని నిర్ణయించుకున్నారు. ఆ 27 గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని, ఓటర్లకు భద్రత కల్పించాలని ఎన్నికల సంఘానికి పుట్టా జిల్లా ఎన్నికల నిర్వహణాధికారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ మేరకు ఆయా సమస్యాత్మక గ్రామాల్లో అధికారులు కట్టుదిట్టమైన భద్రత కల్పించడంతో ఏజెంట్లను కూడా కూర్చోబెట్టగలిగారు. దీంతో ఆ గ్రామాల్లో ఓట్లు వేయడానికి గ్రామస్తులు కూడా ఆసక్తి కనబరచి తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారు. అయితే చాపాడు మండలం చిన్నగులువలూరు పోలింగ్‌కేంద్రంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తన అనచరులతో టీడీపీ ఏజెంట్లను బయటకు లాగి దాడిచేసి తీవ్రగాయాలు పాలు చేశారు. పోలీసులు అప్రమత్తం కావడంతో మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సాఫీగా సాగింది.



సమస్యాత్మక, ఏకపక్ష గ్రామాల్లో..

ప్రజాస్వామ్యబద్ధంగా పోలైన ఓట్లు

- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి స్వంత గ్రామం చాపాడు మండలం నక్కలదిన్నె (పీయస్ 142)లో మొత్తం 1124 మంది ఓటర్లుండగా 977 మంది ఓట్లేశారు.
- కుచ్చుపాప (పీయస్ 144)లో 519 మంది ఉండగా, 476 పోల్ అయ్యియి
- కేతవరం (166)లో 930కి గాను 855 మంది ఓట్లేశారు.
- నర్రవాడ(160)లో 490కి గాను 462 పోల్ అయ్యాయి.
- చిన్నగులువలూరు(167, 168)లో 1082కు గాను 901 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- పెద్దగులువలూరు (169)లో 964 మందికి గాను 834 పోల్ అయ్యాయి.
- ఓబుల్‌రెడ్డిపేట (170)లో 503మంది ఓటర్లుండగా 468 మంది ఓట్లు వేశారు.
- ఖాజీపేట మండలం శాంతినగరం(180)లో 232 మందిలో 189మంది ఓట్లు వేశారు.
- నందిపాడు(201)లో 849కి గాను 733 మంది ఓట్లు వేశారు.
- దుంపలగట్టు(208)లో 1120లో 1036 పోల్ అయ్యాయి.
- టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ స్వగ్రామం బ్రహ్మంగారి మఠం మండలం కొత్తపల్లె(258)లో 273 మందిలో 254 ఓట్లు పోల్ అయ్యాయి.
- నరసన్నపల్లి(243,244,245)లో 1624 మందిలో 1240 మంది ఓట్లు వేశారు.
- చెంచయ్యగారిపల్లె(251)లో 1125కు గాను 998 పోల్ అయ్యాయి.
- దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేట(26)లో 594లో 482 పోల్ అయ్యాయి.
- గొల్లపల్లె(32)లో 608లో 560 పోల్ అయ్యాయి.
- మీర్జాఖాన్‌పల్లె(54)లో 867కు గాను 788 పోల్
- రామాపురం(55)లో 522కు గాను 502 మంది తమ ఓటు హక్కు వినియోగించారు.
- మైదుకూరు మండలంలోని వనిపెంట(64, 65)లో 1479 మందిలో 1305 మంది ఓట్లు వేశారు.
- మైదుకూరులోని అనకుంట(84,92)లో 1500 మందిలో 1193 పోల్ అయ్యాయి.
- మూలబాట (86,87,88, 89)లో 3,904 మందికి గాను 3163 మంది ఓట్లు వేశారు.
- జడ్పీ హైస్కూల్(100,104,105,106)లో 4,478 మందిలో 3,589 మంది ఓట్లు వేశారు.
- బండివారిపల్లె(81)లో 574లో 536 పోల్ అయ్యాయి.
- చిన్నయ్యగారిపల్లె(113)లో 728లో 643 మంది ఓట్లు వేశారు.
- నంద్యాలంపేట(118)లో 1072 ఓట్లు ఉండగా, 833 మంది ఓట్లు వేశారు.
- యన్ ఎర్రబల్లె (123)లో 760కి గాను 715 పోల్ అయ్యాయి.
- గొల్లపల్లె (80)లో 392కు గాను 353 పోల్ అయ్యాయి.
- జాండ్లవరం(126)లో 745కి గాను 670 పోల్ అయ్యాయి.



మైదుకూరు మండలం నంద్యాలంపేట పోలింగ్ కేంద్రం(118)లో బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఒంటిమిట్ట, మే 16: మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధుసూదన్‌రావు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో పోలీసులను నిఘా ఉంచామని, గ్రామాల్లో రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్న వ్యక్తులపై చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు ముగిశాయని, కౌంటింగ్ వరకు ఎలాంటి గొడవలు సృష్టించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎలక్షన్‌లో గొడవలు సృష్టించిన వారు ఐదు సంవత్సరాల పాటు పోలీసు రికార్డులో నమోదవుతారని, ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో గడపాలని ఆయన సూచించారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు లారీలు సీజ్

ఓబులవారిపల్లె, మే 16: మండలంలోని జిల్లెలమడక చెరువులో అనుమతి లేకుండా చెరువు మట్టి తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ గురువారం తెలిపారు. అక్రమంగా లారీలతో ఇటుక బట్టీల వ్యాపారాలకు మట్టి తరలిస్తున్నారని సమాచారం అందడంతో తహశీల్దారు సూచనల మేరకు రెవెన్యూ సిబ్బందితో దాడి చేసి రెండు లారీలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

నేటి నుంచి మాతమ్మ తిరుణాల

పెనగలూరు, మే 16: మండల కేంద్రమైన పెనగలూరు అరుంధతివాడలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు గ్రామ దేవత మాతమ్మ తిరుణాల ఉత్సవాలు జరగనున్నాయని గ్రామస్తులు తెలిపారు. దాదాపు 50 ఏళ్ల తరువాత గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాలు జరగనుండటం విశేషం. ఈ సందర్భంగా గ్రామస్తులు భారీ ఎత్తున బంధుమిత్రులు, స్నేహితులను తిరుణాలకు ఆహ్వానాలు పంపినట్లు గ్రామప్రజలు తెలిపారు.

లాసెట్‌పై 19న అవగాహన

ప్రొద్దుటూరు టౌన్, మే 16: లాలో చేరాలనుకునే విద్యార్థులకు ఈనెల 19వ తేదీ ఒక రోజు లాసెట్‌పై అవగాహన తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు జేవీవీ అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. నందిని క్లాత్ మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో 19వ తేదీ ఉదయం 11 గంటల నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని, నిపుణులు ఆప్టిట్యూడ్, జనరల్ న్యాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ గురించి బోధిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రజల సహకారంతో డెంగ్యూ నివారణ




జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా సంబేపల్లెలో ర్యాలీ చేస్తున్న దృశ్యం, నందలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

సంబేపల్లె, మే 16: మండలంలో ప్రజల సహకారంతో డెంగ్యూ నివారణ చేపడతామని సంబేపల్లె వైద్యాధికారులు సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డిలు తెలిపారు. గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. డెంగ్యూ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటి వృథా అరికట్టడంతో దోమలను నివారించవచ్చని తెలియజేశారు. ప్రజలు జ్వరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలను పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలియజేశారు. ప్రజల సహకారంతో డెంగ్యూ వ్యాధి నివారిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డెమో దేవశిరోమణి, పీహెచ్ఎం పూర్ణమ్మ, టీవీ సూపర్‌వైజర్ శ్రీను, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామాపురం: డెంగ్యూ వ్యాధి రాకుండా నివారించడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని రామాపురం వైద్యాధికారులు వినోద్‌కుమార్, దివ్యశ్రీలు అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో డెంగ్యూ వ్యాధి గురించి సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి రాకుండా ఉండడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, ఇందుకోసం గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగ్యూ వ్యాధి ఏడీఎస్ అనే పగటిపూట కుట్టే దోమవల్ల వస్తుందని, జ్వరం, తలనొప్పి, వాంతులు, శరీరంపై దద్దుర్లు, కీళ్ల నొప్పులు, ముక్కు వెంట రక్తం కారుట, నీరసం, ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. డెంగ్యూ లక్షణాలు ఉన్న వారు సమీపంలోని ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి వైద్యసేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఏ ఎలేజర్, స్థానిక వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సుండుపల్లె: డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ కురవపల్లెలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలియజేశారు. డెంగ్యూ వ్యాధి ఏడీఎస్ దోమకాటు వలన వస్తుందని ప్రజలకు తెలియజేశారు. అధిక జ్వరం, తలనొప్పి, వాంతులు, కీళ్ల నొప్పులు డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఉంటాయని, డెంగ్యూ దోమ పగటిపూట మాత్రమే కుడుతుందన్నారు. తగిన జాగ్రత్తలు పాటించకపోతే డెంగ్యూ జ్వరం బారిన పడాల్సిన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వీరనారాయణ, వైద్య సిబ్బంది గంగాధర్, శ్రీను, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: డెంగ్యూ నివారణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రభుత్వ వైద్యాధికారి శరత్ కమల్ పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందితో బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.శరత్‌కమల్ మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రామంలో డెంగ్యూ నివారణ గురించి గ్రూప్ మీటింగ్‌లు నిర్వహించి దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు వివరించాలని ఆదేశించారు. డెంగ్యూకు కారణమైన దోమలు మంచినీటిలో గుడ్లు పెట్టి దోమలను వృద్ధి చేస్తాయని, కావున ప్రతి శుక్రవారం ఇంటిలోని నీటి తొట్టెలు, బిందెలు, బకెట్లు, డ్రమ్ములు, శుభ్రపరిచి ఒక గంట ఆరబెట్టి మరళా నీళ్లు పట్టుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో టి.వెంకటనారాయణ, సునీల్‌కుమార్, ఎంపీహెచ్ఏ లక్ష్మయ్య, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.




రామాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం, కురవపల్లెలో డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

నేటి నుంచి మహాభారత యజ్ఞం

లక్కిరెడ్డిపల్లె, మే 16: మండలంలోని కోనంపేట గ్రామంలో ఈ నెల 17 నుంచి జూన్ 3వ తేది వరకు పంచమ వేద మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు, కార్యనిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 17వ తేదీన ధ్వజారోహణం, 21న బలిబండి ఊరేగింపు, 23న ద్రౌపదికల్యాణం, 27న అర్జున తపస్సు, జూన్ 1న ఇలావతుని వధ, 2న దుర్యోధనుడి వధ ఉంటుందన్నారు. హరికథా భాగవతారిణి హైమావతి, రేడియో ఆర్టిస్టు ద్వారా ప్రతిరోజు హరికథా కాలక్షేపం ఉంటుందని వారు తెలిపారు. అలాగే శ్రీవెంకటేశ్వర నాట్యమండలి పీలేరు వారిచే రాత్రివేళల్లో మహాభాగవతం ఘట్టంలోని కొన్ని కార్యక్రమాలు ప్రతిరోజు మధ్యాహ్నం వేళలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కోనంపేట గ్రామంలో రామాలయం వద్ద మహాయజ్ఞ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు.

21న లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

లక్కిరెడ్డిపల్లె, మే 16: మండలంలోని రవీంద్రనగర్ వద్ద వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 21న లక్ష్మీ నరసింహస్వామి 30వ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు, లక్ష్మీనరసింహస్వామి కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అత్యంత వైభవంగా 30వ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. మధ్యాహ్నం లల్లూయాదవ్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. రాత్రివేళల్లో స్వాముల వారి ఊరేగింపులో కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కల్యాణ మహోత్సవానికి మండలం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వాముల వారి కల్యాణాన్ని తిలకించాలని వారు కోరారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించండి

● ప్రధానోపాధ్యాయుడు జయన్న



ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రచారం చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు జయన్న

సుండుపల్లె, మే 16: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలని సుండుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయన్న తెలిపారు. గురువారం మండలంలోని సామిసేనిగడ్డ, పెద్దబలిజపల్లె, చెన్నంశెట్టిపల్లె, వెంగమరాజుగారిపల్లెతో పాటు పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సుండుపల్లె ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులు మండలంలో ప్రథమ స్థానంలో రాణించడంతో పాటు మంచి ఉత్తీర్ణతతో మార్కులు తీసుకువచ్చారన్నారు. ప్రైవేటు పాఠశాలలో చేర్పించి వేలాది రూపాయలు ఫీజులు చెల్లించకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని కోరారు. ఉపాధ్యాయులు దేవలానాయక్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం



పేదలకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

నందలూరు,మే 16: దివంగత భూమిరెడ్డి వెంకట కృష్ణయ్య 5వ వర్ధంతి సందర్భంగా ఆయన సంస్మరణార్థం భూమిరెడ్డి కుటుంబీకుల సౌజన్యంతో స్థానిక లయన్స్‌క్లబ్, వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లె ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణంలో గురువారం పేదలకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వేమెడికల్ ఆఫీసర్ బచ్చు జయభాస్కరరావు, లయన్ కుర్రా మణియాదవ్, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ మోడపోతుల రాము, దాసరి నరసింహులు, అడ్వకేటు, వాకర్ గురుప్రసాద్, సెక్రటరీ ఉప్పుశెట్టి సుధీర్, పోతురాజు మస్తానయ్య, గంధం గంగాధర్, సురేష్, వెంకటయ్య, ఆంజనేయులు, సునీల్‌రెడ్డి, గొబ్బిళ్ల మణి, అడ్వకేటు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 22 నుంచి ఓపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నమెంటు

నందలూరు, మే 16: అరవపల్లె ప్లే గ్రౌండ్ యూత్ ఆధ్వర్యంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్ ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంటు ఈ నెల 22వ తేది నుంచి నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ పల్లె గ్రీష్మంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల టీంలు రూ.1500 తమ ఎంట్రీని చెల్లించి మే 20వ తేదీ లోపు జట్ల వివరాలను నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. ఈ టోర్నమెంటులో విజేతగా నిలిచిన వారికి మొదటి బహుమతి కింద రూ.60 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.40 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. టోర్నమెంటులో పాల్గొనదలచిన వారు 9000527227, 9676334033, 8309199305 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సబ్సిడీతో విత్తనాలు పంపిణీ

సిద్దవటం, మే 16: మండలానికి 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగలు, జనుములు మంజూరైనట్లు వ్యవసాయ అధికారి రమేష్‌రెడ్డి తెలియజేశారు. మండలానికి పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగలు 234 క్వింటాలు, జనుములు 10 క్వింటాలు ఇవ్వడం జరుగుతుందని కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం నుంచి 21వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బులు చెల్లించాలన్నారు. వారిలో డబ్బులు చెల్లించిన వారికి ఒక వారం తరువాత విత్తనాలను పంపిణీ చేస్తామని తెలిపారు. జీలుగులు, జనుములు ఒక్కొక్కటి పూర్తి ధర కేజీ రూ.88 కాగా సబ్సిడీ కింద రూ.44తో 50 శాతం సబ్సిడీ కింద ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఏ రైతు పేరుతో పట్టాదారు పాసుపుస్తకం ఉంటుందో ఆ రైతే రైతుభరోసా కేంద్రాలకు వచ్చేటప్పుడు వారి పట్టాదారు పాసుబుక్కులను, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్, డబ్బులతో వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోగలరని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం, మే 16: మండల కేంద్రమైన పీటీ ఎంలో వెలసిన పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో దత్తాత్రేయ స్వామి వారికి పంచామృతాభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. గురువారం ఆధ్యాత్మికవేత్త సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కర్ణాటక రాష్ట్రా నికి చెందిన వేదపండితులు శేషాచలం శర్మా, వేణుగోపాల్ శర్మా, సత్యనారాయణ శర్మా, నటరాజ్ శర్మాలచే దత్తాత్రేయ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పీటీఎంతో పాటు సమీప గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణే లక్ష్యం : జేడీ



క్షయవ్యాధి నిర్మూలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

సంబేపల్లె, మే 16: క్షయ వ్యాధి నివారణే లక్ష్యమని, ప్రతిఒక్కరూ అడల్ట్ బీసీబీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని లెప్రసీ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ తెలిపారు. గురువారం సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా టీకాలను ప్రజలకు అందించారు. 16 వారాల పాటు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం చేపడతామన్నారు. భవిష్యత్తులో క్షయ వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, ఆరోగ్య కేంద్ర పరిధిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి అడల్ట్ బీసీజీ టీకా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ జిల్లా అధికారి శైలజ, వైద్యాధికారి మధుసూదన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ ఆకస్మిక తనిఖీ

నందలూరు, మే 16: నల్లతిమ్మయ్యగారిపల్లె గ్రామంలో అడల్ట్స్‌కు ఏర్పాటు చేసిన బీసీజీ వ్యాక్సినేషన్‌ను మండల ప్రభుత్వ వైద్యాధికారి శరత్‌కమల్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రాష్ట్ర ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం బీసీజీ అడల్ట్ వ్యాక్సినేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్‌కమల్ మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ 18 సంవత్సరాలు నిండిన షుగరు పేషెంట్లు, పొగతాగే వారు, చికిత్స కాలం పూర్తైన టీబీ పేషెంట్లు, బీఎంఐ పేషెంట్స్ వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీవీ సూపర్‌వైజర్ జయప్రకాష్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తున్నడాక్టర్ శరత్‌కమల్

హత్యాయత్నం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



న్యాయం చేయాలని కోరుతున్న బాధితుడు శ్రీధర్

ఓబులవారిపల్లె, మే 16: హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వై.కోటకు చెందిన అడపాల బాలాజీ అనే బాధితుడు పోలీసులను కోరారు. వివరాల్లోకెళితే... వై.కోట గ్రామానికి చెందిన అడపాల శ్రీధర్ ఎన్నికలకు ముందు రోజు ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోని పాఠశాలలో కూర్చొని ఉండగా అదే గ్రామానికి చెందిన బొక్కసం నరేంద్ర, బొక్కసం కోటేశ్వర్, శివశంకర్ మచ్చుకత్తితో దాడి చేసినట్లు ఆరోపించాడు. వీరిలో ఒకరు తనను చేతులు పట్టుకోగా, మరొకరు మటన్ కొట్టే కత్తిలో దాడి చేసినట్లు తెలిపాడు. ఈ ఘటనలో ఎడమ ఛాతికి, తలపైన బలమైన గాయాలై రక్తం కారుతుండగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వై.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. రక్తం ఆగకుండా వస్తుండటంతో రైల్వేకోడూరు ఆసుపత్రికి, అనంతరం అంబులెన్స్‌లో తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారన్నారు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా.. విచారణ చేసి న్యాయం చేస్తామని ఎస్ఐ తెలిపారు.

19న సత్యనారాయణ స్వామివారి కల్యాణం

మదనపల్లి అర్బన్, మే 16: మండలంలోని చిప్పిలి గ్రామంలో వెలసిన సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 19వ తేదీన సత్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు కె.అమరనాథ్ తెలిపారు. గురువారం ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం పోస్టరును ఆలయకమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా ఆల యంలో సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సత్యనారాయణ స్వామి కళ్యాణోత్సవంలో చిప్పిలి గ్రామస్తులే కాకుండా పరిసరి ప్రాంత గ్రామస్థులు కూడా పాల్గొంటారని వారు తెలి పారు. కల్యాణం అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన వితరణ కార్య క్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ కార్యదర్శి వైద్యం రామకృష్ణ, ట్రెజరర్ వి.దివాకర్, కమిటీసభ్యులు అచ్చింతల కుమార స్వామి, శివశంకర్, అన్నసాగరం ప్రభాకర్, అర్చకుడు ఫణితేజా పాల్గొన్నారు.

మద్దెమ్మ ఆలయానికి రూ.లక్ష సాయం

ములకలచెరువు, మే 16: మండలంలోని చౌడసముద్రం సమీపంలో వెలసిన మద్దెమ్మ ఆలయానికి గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. ఆల య అభివృద్ధి పనులకు గానూ కర్ణాటక రాష్ట్రం రాగుట్టహళ్ళికి చెందిన శ్రీరామరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి లలితమ్మ, కుమారులు హర్ష, రాహుల్, మనవడు రాజారెడ్డి, మనవరాలు సాయిరారూబిలు రూ.లక్ష విరాళాన్ని ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి, కార్యనిర్వాహకుడు పుట్టాశేఖర్‌గుప్తాకు అంద జేశారు. గతంలో కూడా వారు ఆలయంలో నాగులు, నవగ్రహాల ఏర్పాటు, ప్రతిష్ఠకు రూ.4లక్షలు సహాయం అందజేశారు. అలాగే 2022 డిసెంబర్ 8వతేదీన కూడా ఆలయం ఆవరణలో వంటశాల నిర్మాణానికి రూ.80వేలు విరాళం ఇచ్చారు.

గొడవలు పెట్టుకుంటే నాన్‌బెయిలబుల్ కేసులు : సీఐ

చక్రాయపేట, మే 16: గొడవలు పెట్టుకొని కొట్టుకునే వారిపై అటెంప్ట్ మర్డర్ లాంటి నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆర్కేవ్యాలీ సీఐ గోవిందరెడ్డి గురువారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు. ఎన్నికల తర్వాత మన రాష్ట్రంలో జరుగుతున్న పోస్ట్ పోల్ సంఘటనలు దృష్టిలో పెట్టుకొని ఎవరైన అలజడులు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎంతటివారినైనా ఉపేక్షించమన్నారు. రౌడీషీట్స్ కూడా ఓపెన్ చేసి మండల, జిల్లా బహిష్కరణ చేయడం జరుగుతుందన్నారు. ఆర్కేవ్యాలీ పరిధిలోని వేముల, చక్రాయపేట, ఆర్కేవ్యాలీ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రజలు, రాజకీయ నాయకులు గొడవలు పెట్టుకోవద్దన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి కలశారాధన

మదనపల్లె అర్బన్, మే 16: స్థానిక కదిరి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో కలశారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు పి.లక్ష్మీ నారాయణాచారి, నవయుగ స్వర్ణకారుల సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ అప్పినిపల్లె భాస్కరాచారిలు నిర్వహించారు. గురువారం ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, 9గంటలకు నాగదేవతల ఆరాధన, స్వామివార్లకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో కలశారాధనతో పాటు హోమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మహామంగలహారతి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేటి నుంచి ఆరాధన ఉత్సవాలు

సింహాద్రిపురం, మే 16: మండలంలోని అంకాళమ్మ గూడూరులో పోతులూరి వీరబ్రంహేంద్రస్వామి ఆరాధన మహోత్సవం శుక్ర, శనివారం రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు. 17వ తేదీ ఉదయం 7 గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్య క్రమం, తాళాల భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాత్రి 8 నుంచి నంద్యాల గౌతమి బృందంచే వీరబ్రంహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం ఉంటుందన్నారు. 18వ తేదీ ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, భజన బృందాలకు పోటీలు, అన్న దాన కార్యక్రమం, రాత్రి 8 గంటలకు సానవల చిన్నమ్మ కథ, భక్తిరస నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న సమ్మర్ క్యాంప్

ప్రొద్దుటూరు టౌన్, మే 16: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ఉత్సాహంగా సాగుతోంది. గురువారం రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూలులో సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. గణిత ఉపాధ్యాయురాలు నిర్మలాజ్యోతి అంకెలు, సంఖ్యలు, కూడికలు, బాగహారం, గుణకారం, స్థాన విలువలు, వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం విద్యార్థులకు వేమన పద్యాలను బోధించి వాటి బావాన్ని తెలిపారు. అనంతరం విద్యార్థులకు క్యారెంబోర్డు, చెస్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహింసాహెబ్, శారద, రవిబాబు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

విషపురుగు కుట్టి ఆవు మృతి

పోరుమామిళ్ల, మే 16: విషపురుగు కు ట్టడంతో ఆవు మృతి చెందింది. బలిజకోట వాసి సిద్దయ్య ఆవుకు విషపురుగు కుట్టి నట్లు పంచాయితీ అధికారులకు తెలపడంతో సర్పంచ్ యనమల సుధాకర్ ఆదేశాల మేరకు పంచాయితీ కార్యదర్శి వెంకట సుబ్బయ్య సిబ్బందితో వెళ్లి ఖననం చేయించారు.

సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలను నియంత్రించడంలో పోలీసు యంత్రాంగం విఫలం కావడంతో అంతా ఊహించినట్టుగానే జరిగిపోయింది. ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌పై బదిలీ వేటు వేసిన ఎన్నికల కమిషన్.. తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ భాస్కర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి సీఐ రాజశేఖర్, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డిని సస్పెండు చేసింది. ఎస్పీ సహా వీరందరిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. దీనికి తోడు ఈసీ నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం జిల్లాలో కూడా హింసాత్మక ఘటనల పూర్వాపరాలను, వాటిని అడ్డుకోవడంలో, అనంతర చర్యల్లో ఎస్పీ సహా కింది స్థాయి అధికారులు వ్యవహరించిన తీరును లోతుగా విచారించి ఈసీకి నివేదిక ఇవ్వనుంది. ఎన్నికల నిర్వహణను ఆషామాషీగా తీసుకున్న అధికారులు దానికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఊహించిందే జరిగింది!

- జిల్లా ఎస్పీ బదిలీ
- తిరుపతి డీఎస్పీ, ఎస్బీ డీఎస్పీ సస్పెన్షన్
- స్పెషల్ బ్రాంచి సీఐ, అలిపిరి సీఐ కూడా..
- ఐదుగురిపైనా శాఖాపరమైన విచారణ
- ఎన్నికల కమిషన్ సంచలనాత్మక చర్యలు
- చంద్రగిరి నియోజకవర్గంలో 'పోలింగ్'.. అనంతర హింసాత్మక ఘటనలపై ఆగ్రహం



ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ | స్పెషల్ బ్రాంచి డీఎస్పీ భాస్కర్‌రెడ్డి | తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి | స్పెషల్ బ్రాంచి సీఐ రాజశేఖర్ | అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి

నామినేషన్ల నాడే తొలి ప్రమాద ఘంటికలు

చంద్రగిరి వైసీపీ, టీడీపీ అభ్యర్థులను గత నెల 25వ తేదీన ఒకే సమయంలో నామినేషన్లకు అనుమతించినప్పుడే అధికారుల అవగాహనా రాహిత్యం బట్టబయలైంది. టీడీపీ అభ్యర్థి కోసం భారీ ఎత్తున తరలివచ్చిన శ్రేణులను పోలీసులు నియంత్రించలేకపోయారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద ఇరువర్గాలూ రాళ్ళ దాడికి దిగడంతో పాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై రాళ్లు, కర్రలతో దాడి జరిగింది. లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపు చేయాల్సి వచ్చింది. వాస్తవానికి అప్పుడే అధికారులు అప్రమత్తమై చంద్రగిరి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించివుండాల్సింది. కానీ అలా జరగలేదు.

నానీపై దాడి ఘటనలో బట్టబయలైన పోలీసు వైఫల్యం

పోలింగ్ మరునాడు టీడీపీ అభ్యర్థి నానీపై జరిగిన దాడి ఘటనలో పోలీసు వైఫల్యం బయటపడింది. నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తనకు, తన కుటుంబానికి తగిన రక్షణ లేదని ఆయన హైకోర్టును ఆశ్రయించి గన్‌మెన్ భద్రత పొందారు. అలా పొందిన కొద్ది రోజులకే ఆయనపై ఏకంగా హత్యాయత్నం జరిగింది. ప్రధాన ప్రతిపక్ష నేతకు తగిన భద్రత కల్పించడంలో పోలీసు యంత్రాంగం విఫలమైంది. తర్వాత కూడా అక్కడ పరిస్థితులను అదుపు చేయడంలో పోలీసు యంత్రాంగం చేతులెత్తేసింది. వర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఈ దాడి ఈవీఎంలు వుంచిన స్ట్రాంగ్ రూముల భద్రతను కూడా ప్రశ్నార్థకం చేసింది.

డక్కిలి, చిల్లకూరు మండలాల్లోనూ హింసాత్మక ఘటనలు

- గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వరరెడ్డికి తిక్కగుంటపాలెంలో రొయ్యల చెరువులు ఉన్నాయి. పోలింగ్‌కు ముందు రోజైన ఆదివారం రాత్రి రొయ్యల చెరువుల్లో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలిపారు. దీంతో రూ. 15 లక్షలు విలువైన రొయ్యలు చనిపోయి నీటిపైకి తేలాయి. ఈ ఘటనపై బాధితులు పోలీసులు ఫిర్యాదు చేశాడు.
- వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి మండలం అల్తూరుపాడులో పోలింగ్ రోజు ఓ కానిస్టేబుల్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ గ్రామస్తులు దాడి చేసి కొట్టారు.
- గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలం చింతవరం గ్రామానికి చెందిన టీడీపీ నేత గోపాల్ పోలింగ్ రోజు టీడీపీకి అనుకూలంగా పనిచేశారని ఆరోపిస్తూ మరుసటి రోజైన మంగళవారం వైసీపీ వర్గీయులు ఇనుప రాడ్లతో దాడి చేసి తలపై తీవ్రంగా గాయపరిచారు.
- చిల్లకూరు 114, 117 బూత్‌లలో పోలింగ్ రోజు టీడీపీ నేత కొండా రామచంద్రారెడ్డిపై వైసీపీ నేత నరేంద్ర రెడ్డి దాడి చేసి కొట్టారు. బాధితునికి రక్షణ కల్పించాల్సిన చిల్లకూరు ఎస్‌ఐ అంజిరెడ్డి దానికి భిన్నంగా బాధితుడినే లాఠీతో చితకబాదారు. తోపులాట, ఘర్షణతో టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌తో పాటు టీడీపీ దళిత మహిళా నేత విజయ కూడా గాయపడ్డారు.

పోలింగ్ రోజు ఐదు చోట్ల ఉద్రిక్తత

ఈనెల 13న పోలింగ్ సందర్భంగా రామచంద్రాపురం మండలం బ్రాహ్మణకాల్వ పోలింగ్ కేంద్రంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల నడుమ ఘర్షణ జరిగింది. బీఎస్ఎఫ్ జవాన్ గాల్లోకి కాల్పులు జరిపినా పరిస్థితి అదుపులోకి రాలేదు. వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి భారీగా అనుచరులను వెంటదీసుకుని టీడీపీ కంచుకోట వంటి ఆ గ్రామంలోకి వచ్చి తమ ఏజంట్లపై దాడి చేసింది ఎవరంటూ టీడీపీ ఏజంట్లపై దౌర్జన్యానికి యత్నించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. అదే రోజు నానీ స్వగ్రామమైన పాకాల మండలం పులివర్తివారిపల్లికి వెళ్లిన వైసీపీ అభ్యర్థిని గ్రామస్తులు అడ్డుకోగా ఉద్రిక్తత నెలకొంది. ఆయన్ను నిర్బంధించారన్న ప్రచారంతో తుమ్మలగుంటలో గ్రామస్తులు పోలింగ్ కేంద్రాన్ని చుట్టుముట్టి మోహిత్ క్షేమంగా వచ్చేవరకూ ఈవీఎంలను తరలించడానికి వీల్లేదని అడ్డుపడ్డారు. అక్కడ టీడీపీ నేత దొడ్ల కరుణాకర్‌రెడ్డిపై దాడికి యత్నించారు. అదే రోజు రాత్రి చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, కూచివారిపల్లి గ్రామాల్లో వైసీపీ, టీడీపీ వర్గీయులు దాడులు, ప్రతిదాడులకు పాల్పడ్డారు. ఆ గ్రామాలకు మోహిత్ అనుచరులతో వెళ్లడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. వైసీపీ సర్పంచ్ ఇల్లు, రెండు కార్లను టీడీపీ వర్గీయులు తగులబెట్టారు.





పోలింగ్ రోజున బ్రాహ్మణ కాల్వ పోలింగ్ కేంద్రంలో ఘర్షణ



ఈనెల 13న కూచివారిపల్లిలో చెవిరెడ్డి మోహిత్, పులివర్తి వినీల్ మధ్య వాగ్వాదం

కలెక్టర్ లక్ష్మీశా బదిలీతో అప్రమత్తం కాని యంత్రాంగం

ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లకు మించి విధులు నిర్వర్తిస్తున్న అధికారుల బదిలీల్లో భాగంగా కలెక్టర్ వెంకట్రమణారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశా గత డిసెంబరులో కలెక్టర్‌గా వచ్చారు. ఆయన తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని ఇంటికి వెళ్ళి మరీ కలసి శాలువా కప్పి సత్కరించడంతో ప్రతిపక్షాల నమ్మకాన్ని కోల్పోయారు. ప్రతిపక్ష పార్టీల నేతల ఫిర్యాదుతో ఈసీ ఆయన్ను గత నెల 2వ తేదీన బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రవీణ్‌కుమార్‌ను కలెక్టర్‌గా నియమించింది. ఈసీ తీరు ఎలా వుందో ఈ ఘటన స్పష్టంగా వెల్లడించినా జిల్లాలో అధికారులు మాత్రం అప్రమత్తం కాలేదు.

మరోసారి గంగలో కలసిన జిల్లా పరువూ ప్రతిష్ఠ

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోరంగా విఫలమైన నాటి కలెక్టర్ భరత్ నారాయణ గుప్తా, తిరుపతి అర్బన్ ఎస్పీ ఆవుల రమేష్‌రెడ్డిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో పలమనేరు డీఎస్పీ, శ్రీకాళహస్తి, పుంగనూరు సీఐలపైనా బదిలీ వేటు పడింది. తర్వాత తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఘటనలతో అప్పటి తిరుపతి మున్సిపల్ కమిషనర్ గిరీశా, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఇద్దరు సీఐలు, ఓ ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్, తిరుపతి అర్బన్ తహసీల్దారు, డిప్యూటీ తహసిల్దారు సస్పెన్షన్‌కు గురయ్యారు. తాజా ఎన్నికల్లో తిరుపతి కలెక్టర్ లక్ష్మీశా కూడా బదిలీ వేటుకు గురయ్యారు. ఈ ఘటనలతో ఇప్పటికే దారుణంగా దెబ్బతిన్న జిల్లా పరువు ప్రతిష్ఠలు తాజాగా ఈసీ ఆదేశాలతో మరింతగా గంగ పాలయ్యాయి.

అనుభవలేమితో ఎస్పీ తప్పటడుగు!

శాంతి భద్రతల నిర్వహణ, ఎన్నికల నిర్వహణల్లో తగిన అనుభవం, అవగాహన లేకపోవడంతోనే ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తప్పటడుగు వేసినట్టు తెలుస్తోంది. 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారైన ఈయన రంపచోడవరంలో అసిస్టెంట్ ఎస్పీగా, కర్నూలు జిల్లాలో సెబ్ ఏఎస్పీగా, విజయవాడలో లా అండ్ ఆర్డర్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు. ఎస్పీగా తిరుపతిలోనే తొలి పోస్టింగ్. సరిగ్గా ఎన్నికల సమయంలో ఎస్పీగా విధులు చేపట్టడంతో తగిన అనుభవం, అవగాహన లేక కింది స్థాయి అధికారులపై ఆధారపడటం ఆయనకు చేటు చేసింది. అనుభవం, సమర్థత కలిగిన తదుపరి స్థాయి అధికారులు వున్నప్పటికీ వారిని పక్కనపెట్టి వారి కంటే కింది స్థాయిలో వున్న కొందరు అధికారులపై ఆధారపడ్డారని, అధికార పార్టీ నేతలతో అంటకాగుతున్న వారి సలహాలు, సూచనలతోనే విధి నిర్వహణలో విఫలమయ్యారన్న ప్రచారం జరుగుతోంది. 2014 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గంలో ఘర్షణలు జరగడం, 2019లో ఏడు చోట్ల రీ పోలింగ్ జరగడం వంటి గత చరిత్రను ఎస్పీ పూర్తిగా విస్మరించినట్టు కనిపిస్తోంది. దీనికి తోడు తిరుపతి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నాటి ఘర్షణలు, 2021 తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఉదంతాలూ పరిగణనలోకి తీసుకున్నట్టు లేదు. జిల్లాకు ఎస్పీగా వచ్చినపుడు ఇక్కడి గత చరిత్రను తెలుసుకుని దానికనుగుణంగా జాగ్రత్తలు తీసుకుని వుంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

తిరుపతి ఎమ్మెల్యే బహిరంగంగా బెదిరించినా..

తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పోలింగ్‌కు రెండు రోజులు ముందు జీవకోనలో ఎన్నికల ప్రచారంలో బహిరంగంగా ఆంధ్రజ్యోతి ప్రతినిధులను బెదిరించారు. మళ్లీ అధికారంలోకి వస్తే అంతు చూస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఇది ఉల్లంఘించడమే అయినా పోలీసులు స్పందించలేదు. జర్నలిస్టు సంఘాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బెదిరింపులు మళ్ళీ కొనసాగుతుండడంతో మరోసారి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘాలు యత్నించినా కనీసం కలిసేందుకు కూడా ఆయనఅవకాశం ఇవ్వలేదు.

కులం పేరుతో దూషించి.. కొట్టారు

- రామకుప్పం ఎస్‌ఐపై గిరిజనుడి ఫిర్యాదు

రామకుప్పం, మే 16: తనను కులం పేరుతో దూషించి, లాఠీతో కొట్టారంటూ రామకుప్పం మండలం వీర్నమలతాండాకు చెందిన వెంకటేష్‌నాయక్ గురువారం ఎస్‌ఐ శివకుమార్‌పై ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. సోదరులైన వెంకటేష్‌నాయక్, షణ్ముఖనాయక్, లోకేంద్రనాయక్ వీర్నమలతాండా సమీపంలోని పొలాల్లో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. వీరు బెంగళూరులో కంప్రెసర్ బండ్లు పెట్టుకుని, కూలిపనులు చేసుకుంటున్నారు. ఓట్లేయడానికి వీరంతా స్వగ్రామానికి వచ్చారు. కాగా, వెంకటేష్‌నాయక్‌కు వచ్చే అదనపు పనులను లోకేంద్రనాయక్‌కు ఇస్తుండటంపై, మరో సోదరుడు షణ్ముఖనాయక్ ఆగ్రహంతో ఉన్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తమ ఇంటి ముందు కత్తులు నూరుతున్న షణ్ముఖనాయక్, అతడి భార్య మంజు, కుమారుడు బాలాజీనాయక్‌ను చూసి ఎందుకిలా చేస్తున్నారని వెంకటేష్‌నాయక్ ప్రశ్నించగా, నీ కుటుంబాన్ని చంపడానికంటూ వారు దుర్భాషలాడారు. వెంటనే షణ్ముఖనాయక్ కత్తితో వెంకటేష్ కుడిచేతిపై నరికాడు. అడ్డు వచ్చిన వెంకటేష్‌నాయక్ కుమారుడు ఠాగూర్‌నాయక్‌ను బాలాజీనాయక్ కర్రతో తలపై కొట్టాడు. లోకేంద్రనాయక్ కుమారుడు ఈశ్వర్‌నాయక్ వచ్చి వారిని కాపాడారు. ఠాగూర్‌నాయక్‌ను కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బుధవారం వెంకటేష్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు షణ్ముఖనాయక్, మంజు, బాలాజీనాయక్‌పై ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. అనంతరం వెంకటేష్‌నాయక్‌తోపాటు షణ్ముఖనాయక్, లోకేశ్‌నాయక్‌ను ఎస్‌ఐ తన గదికి పిలిపించారు. అదే సమయంలో ఆయనకు ఫోన్ వచ్చింది. ఆ తర్వాత వారిని దుర్భాషలాడారు. దీనిపై ప్రశ్నించగా, కులం పేరుతో దూషించి, లాఠీతో కొట్టారని బాధితులు ఆవేదన చెందారు. అదే సమయంలో స్టేషనుకు వచ్చిన టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్ చూసి.. వారిని ఎందుకు కొడతారంటూ ఎస్‌ఐని అడగ్గా, అతడినీ దుర్భాషలాడుతూ బొక్కలో వేస్తానని బెదిరించారన్నారు. ఎస్‌ఐపై తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వెంకటేష్‌నాయక్ తన ఫిర్యాదులో కోరారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోండి : దళిత, గిరిజనులే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్న ఎస్‌ఐ శివకుమార్‌పై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, జిల్లా కార్యదర్శి జయశంకర్, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయక్, ఎస్టీసెల్ జిల్లా, నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణానాయక్, కామరాజనాయక్, గిరిజనతాండాల నేతలు డిమాండు చేశారు. వీర్నమల తాండాలో ఘర్షణ పడ్డ సోదరులు పోలీస్‌స్టేషనుకు వస్తే వారిపై ఎస్‌ఐ దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. ఆదివారం సాయంత్రంలోగా ఎస్‌ఐపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకపోతే, సోమవారం ఉదయం కుప్పం డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. దీనిపై ఎస్‌ఐ శివకుమార్‌ను వివరణ కోరగా.. ఇదంతా టీడీపీ నేత కృష్ణానాయక్ ఆడిస్తున్న నాటకమని ఆరోపించారు. తాను ఎవరినీ కులం పేరుతో దూషించలేదని, లాఠీతో కొట్టలేదన్నారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు మొదలై చాలా రోజులైనప్పటికీ ఎన్నికల కారణంగా కొండపై రద్దీ తక్కువగానే కనిపించింది. వారాంతాల్లో మినహా మిగిలిన రోజుల్లో చాలా సాధారణంగా ఉంది. రాజకీయ నాయకులు కూడా ఎన్నికల ప్రచారంలో నిమగ్నం కావడంతో వీఐపీ బ్రేక్‌లో కూడా వీఐపీలు తక్కువగా కనిపించారు. ఈనెల 13వ తేదీతో పోలింగ్ ప్రక్రియ పూర్తవడంతో ఇటు సాధారణ భక్తులు, అటు వీఐపీలు తరలివస్తున్నారు. దీంతో గురువారం సాయంత్రం నుంచి రద్దీ భారీగా పెరిగింది. శ్రీవారి ఆలయం, మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద భవనం, లడ్డూకౌంటర్ వంటి ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రద్దీ పెరిగిన నేపథ్యంలో గదుల కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో బారులు తీరుతున్నారు. కల్యాణకట్టల్లోనూ రద్దీ అధికంగా ఉంది.



ఆలయం ముందు భక్తుల రద్దీ



దక్షిణ మాడవీధిలో భక్తులు ప్రదక్షిణ చేయడానికి వీల్లేకుండా పెట్టిన గేట్

వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలో షెడ్లు నిండిపోవడంతో సర్వదర్శన భక్తులకు 24 గంటల దర్శన సమయం పడుతున్నట్టు టీటీడీ మైకుల ద్వారా ప్రచారం చేస్తోంది.

ప్రదక్షిణ చేయనీయకుండా గేట్లు?

రద్దీ పెరిగిన క్రమంలో చాలా మంది భక్తులు కనీసం ఆలయ నాలుగు మాడవీధుల్లో ప్రదక్షిణ చేసి, అఖిలాండం వద్ద కొబ్బరికాయాలు కొట్టి వెళ్లిపోతుంటారు. అయితే రద్దీ పెరిగిందనే పేరుతో దక్షిణ మాడవీధిలోని మూవింగ్ బ్రిడ్జి వద్ద ఉన్న గేటును మూసి వేసి భక్తులకు ప్రదక్షిణ చేసే అవకాశం కూడా లేకుండా చేశారు. దాంతో ఇటు స్వామి దర్శనం లభించక, అటు గుడి చుట్టూ ప్రదక్షిణ కూడా చేసే అవకాశం లేకపోవడంతో చాలా మంది భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పైగా మూవింగ్ బ్రిడ్జి సమీపానికి చేరుకునేవారితో అక్కడున్న భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తించారంటూ పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు

రఘురామకృష్ణరాజు



రేణిగుంట, మే 16: ఓటమి భయంతోనే కూటమి నాయకులపై వైసీపీ దాడులకు పాల్పడుతోందని పశ్చిమగోదావరి జిల్లా ఉండి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణరాజు విమర్శించారు. గురువారం తిరుపతి విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్, సజ్జల మాటల్లో ధ్వనిస్తున్న వణుకు వారి ఆందోళనను చాటుతోందన్నారు. వారి ముఖ కవళికలు చూస్తే స్పష్టంగా ఓటమి అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో ఈ 15రోజులూ కేడర్‌లో జోష్‌ను నింపేందుకు 150 స్థానాలు స్థానాలు గెలుస్తున్నామని వైసీపీ నేతలు చెబుతూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారన్నారు. కూటమి 1994లో కన్నా 130, 135 స్థానాలు విజయం సాధిస్తుందన్నారు. 150 స్థానాలు సాధించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం ఆయన చంద్రగిరి కూటమి అభ్యర్థి పులివర్తి నానిని పరామర్శించేందుకు వెళ్లారు.

తిరుపతిలో కారు దగ్ధం

తిరుపతి(నేరవిభాగం),మే16: ఇంజిన్ వేడెక్కి.. బ్యాటరీల నుంచి మంటలు చెలరేగడంతో ఓ కారు దగ్ధమైంది. ఈ ఘటన తిరుపతి గరుడ సర్కిల్ సమీపంలో జరిగింది. నంద్యాల జిల్లా బనగానపల్లెకి చెందిన ఎం.శ్రీనివాస రెడ్డి కుటుంబీకులతో తిరుమలకు వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం కారులో గురువారం తిరుపతికొచ్చారు. అనంతరం మోహన్‌బాబు కాలేజీ వద్దకెళ్లి అక్కడ తెలిసిన వారితో మాట్లాడి జూ పార్కు రోడ్డులో తిరుపతికి బయల్దేరారు. గరుడ సర్కిల్ సమీపానికి వచ్చేసరికి కారుఇంజిన్ వేడెక్కి,ఉన్నట్టుండి బ్యాటరీలనుంచి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై వాహనంలోని వారిని దింపేయడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు చాలావరకు దగ్ధమవగా, రూ.5లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు అగ్నిమాపకశాఖ తిరుపతి జిల్లా అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మృత్యుఒడికి ముగ్గురు అక్కా చెల్లెళ్లు

- దీపాలు వదులుతూ చెరువులో జారిపడి మృతి



గూళూరు చెరువు

విలపిస్తున్న తల్లి విజయ

వడమాలపేట, మే 16: దీపాలు చెరువులో వదులుతుండగా ప్రమాదవశాత్తూ ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృత్యువాత పడ్డారు. వివరాలివి. వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన బాబు, విజయ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రూపిక(10) 5వ తరగతి, చరిత(13) 9వ తరగతి, యూషిక(ఇంటర్మీడియట్) చదువుతున్నారు. బాబు గ్రామంలో ఆర్‌ఎంపీగా ప్రాక్టీస్ చేస్తారు. గురువారం అతను మహాశివుని దర్శనార్థం తమిళనాడులోని తిరువణ్ణామలై వెళ్లారు. భార్య విజయ తన కుమార్తెలతో దిగువ గూళూరు వద్ద శివాలయంలో పూజ చేయడానికి వెళ్లింది. ఆమె పూజ చేస్తుండగా.. గూళూరు చెరువులో దీపాలు వదలడానికి ముగ్గురు అక్కాచెల్లెళ్లు వెళ్లారు. మెట్లమీద కూర్చొని దీపాలు వదులుతుండగా రూపిక జారి పడింది. వెంటనే కాపాడడానికి ప్రయత్నిస్తూ ఇద్దరు అక్కాచెల్లెళ్లు చెరువులో దూకారు. వీరి అరుపులు, కేకలు విని సమీపంలోని స్థానికులు వెళ్లారు. కానీ అప్పటికే ముగ్గురూ చెరువులో మునిగి చనిపోయారు. తల్లి విజయ చెరువు దగ్గర కన్నీరుమున్నీరైంది. ముగ్గురి మృతదేహాలను గ్రామస్తులు బయటకు తీశారు. మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు.



రూపిక, చరిత, యూషిక మృతదేహాలు

శోకసంద్రంలో ఎస్‌బీఆర్ పురం

అక్కాచెల్లెళ్ల మృతి సమాచారంతో గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది. పుత్తూరు ప్రభుత్వాస్పత్రి పరిసరాలు కుటుంబీకులు, బంధువుల రోదనలతో నిండిపోయాయి. ముగ్గురు కుమార్తెలను కోల్పోయిన తల్లి విజయను ఓదార్చడం ఎవరి తరమూకాలేదు. పెద్దకుమార్తె యూషిక ఇంటర్‌లో 990 మార్కులు సాధించింది. అప్పు చేసి.. తిరుపతిలోని ప్రైవేటు కళాశాలలో చదివిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ప్రజా సహకారంతోనే డెంగ్యూ నివారణ



వాల్మీకిపురం మండలం చింతపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం, మే 16: ప్రజా సహకారంతోనే డెంగ్యూ నివారణ సాధ్యమని వాల్మీకిపురం మండల చింతపర్తి పీహెచ్‌సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించి సచివాలయంలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఇంటిలోని కిటికీలకు మెస్ ఏర్పాటు చేసుకోవడం వల్ల దోమ కాటు నుంచి రక్షణ పొందవచ్చన్నారు. వారానికి ఒకసారి డ్రై డేగా పాటించి వాడకంలో ఉన్న నీటిని నిలువ ఉంచుకున్న పాత్రలు పంపులలోని నీటిని తొలగించి ఆరబెట్టి తిరిగి నీటిని నింపుకుని వాడుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ,మలేరియా సబ్‌యూనిట్ అధికారి ముజీబ్, ఆరోగ్య పర్యవేక్షకులు సుధాకర్, ఎల్‌టీ సురేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పాపిరెడ్డిగారిపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కలకడలో: జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపల్లె ఆసుపత్రి వైద్యులు జవహర్‌బాబుతో కలిసి పాపిరెడ్డి గారిపల్లెలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ నెల నుంచి జనవరి వరకు దోమ లార్వా ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందన్నారు. గ్రామాలోని ప్రజలు ఇళ్ల వద్ద మురుగు నీరు నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే దోమ నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ములకలచెరువులో: ములకలచెరువులో గురువారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి పురవీధుల్లో ప్రదర్శన చేపట్టారు. వైద్యాధికారిణిలు జాహ్నవిరెడ్డి, రేష్మాలు మాట్లాడుతూ డెంగ్యూ నివారణకు ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని సహకరించాలన్నారు. కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో బాలుడు అదృశ్యం

బి.కొత్తకోట, మే16: బి.కొత్తకోట పట్టణం లోని పంజూరమ్మ వీధికి చెందిన ఓ బాలుడు అదృశ్యమైనట్లు సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ పేర్కొన్నారు. పంజూరమ్మ వీధికి చెందిన మహేష్‌బాబు తన కుమారుడు దండు ఖుషివర్ధన్(12) గురువారం ఉదయం నుంచి కనిపించుడం లేదని ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామన్నారు. తప్పిపోయిన బాలుడు ఖుషివర్ధన్‌కు మతిస్థిమితం సరిగా లేదన్నారు. బాలుడి ఆచూకి తెలిసిన వారు తండ్రి ఫోన్‌నెంబరు 6303624722 కు, లేదా 9440900707 నెంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

నిందితురాలు అరెస్టు, రిమాండ్

మదనపల్లె అర్బన్, మే 16: గత ఫిబ్రవరి నెలలో ఇరువర్గాలు దాడి చేసుకున్న సంఘటనలో గంగాధర్ అనే వ్యక్తికి చెయ్యి విరిచివేసిన కేసులో నిందితురాలు సునితా(32)ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకట సుబ్బయ్య తెలిపారు. స్థానిక చీకలగుట్టకు చెందిన గంగాధర్, సుజాత ఇరువర్గాలు దాడి చేసుకున్నారని అప్పట్లో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఈ కేసుకు సంబంధించిన నిందితురాలు సుజాతను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్ఐ తెలిపారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి

నిమ్మనపల్లి, మే 16: మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతిలో గల మోడల్‌స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల కోసం బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మోడల్ స్కూల్ ప్రారంభమై 3సంవత్సరాలు కావస్తున్నా పాఠశాల వద్ద విద్యార్థులకు కనీస సౌకర్యం లేదని తెలిపారు. 6వతరగతి నుంచి ఇంటర్‌వరకు తరగతులు ఉన్నాయని నిమ్మనపల్లితో పాటు పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వస్తారన్నారు. పాఠశాల వద్ద బస్‌షెల్టర్ లేక తీవ్ర ఇబ్బందులు పడున్నారన తెలిపారు. ఒక్కోసారి బస్సులలో రద్దీ ఎక్కువై ఆపక పోవడంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చినుకు పడితే ఇక అంతే..!

- మదనపల్లె పట్టణంలో మురికి కూపంగా మారిన తాళ్లవారివీధి
- సెలెక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీలో 30 కుటుంబాల అవస్థలు



చిన్నపాటి వర్షానికే జలమయమైన తాళ్లవారివీధి (ఫైల్‌ఫోటో)



తాళ్లవారివీధి జంక్షన్‌లో దెబ్బతిన్న డ్రైనేజి వ్యవస్థ

మదనపల్లె టౌన్, మే 16: పైన కనిపిస్తున్న చిత్రాలను చూసారు కదా..ఇదేదో మండలంలోని మారుమూల గ్రామంలో కనిపిస్తున్న దృశ్యం అనుకుంటే పొరపాటే..అన్నమయ్య జిల్లాలోనే ఏకైన స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటి మదనపల్లె పట్టణం నడిబొడ్డున తాళ్లవారివీధిలో కనిపిస్తున్న మురికికూపం. స్థానిక శ్రీ కృష్ణ కళ్యాణమండపం ఎదురుగా తాళ్లవారివీధి ఉంది. ఈ వీధిలో 30 కుటుంబాలు, ఎస్టీయూ భవన్ ఉన్నాయి.

మదనపల్లె-కదిరి రోడ్డు నుంచి వెళ్లే ఈ వీధిలోకి ఇప్పుడు ఎవరు వెళ్లాలన్నా ముక్కులు మూసుకుని, కళ్లు తెరచు కుని జాగ్రత్తగా నడవాల్సిందే. ఎవరైనా అజాగ్రత్తగా నడిస్తే మురికికాలువ, రోడ్డు కలసిపోయిన చోట గోతిలో పడిపోతారంతే. కదిరి రోడ్డుకు ఇరువైపులా ప్రధాన మురుగునీటి కాలువలు ఉన్నాయి. ఈ కాలువలపైనే చాలా మంది దుకాణాలు నిర్మించడంతో కాలువలు కుచించుకుపోయాయి. దీంతో చిన్నపాటి వర్షం వచ్చినా ఈ మురుగుకాలువలు నిండిపోయి, కదిరిరోడ్డుకు ఒక అడుగు తగ్గున ఉన్న తాళ్లవారి వీధిలో వర్షం, మురుగునీరు వచ్చి నిల్వ ఉండిపో తోంది. అంతే కాకుండా మూడు కాలువలు కలిసే చోట డ్రైనేజి వ్యవస్థ అస్తవ్య స్తంగా ఉండటంతో మురుగు, వర్షం నీరు కలసి ఇక్కడే నిల్వ ఉండిపోతోంది. మున్సిపల్ అధికారులు, సిబ్బంది కనీసం ఈ మురుగునీటిని పంప్‌లతో తోడి బయటకు పంపకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని ఈ వీధి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాదండి తాళ్లవారివీధి వార్డు ఏకంగా మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికైన వార్డు కావడం గమనార్హం. చైర్‌పర్సన్ వార్డులోనే ఇంత ఘోరంగా పారిశుద్ధ్యం, డ్రైనేజి వ్యవస్థ ఉంటే మిగిలిన వార్డుల్లో పరిస్థితి చెప్పనవసరం లేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా కనీసం మున్సిపల్ అధికారులైనా తక్షణం స్పందించి ఈ వీధి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో టీబీ వ్యాధి నివారించవచ్చు



మదనపల్లెలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది



తంబళ్లపల్లెలో బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె టౌన్, మే 16: దీర్ఘకాలిక వ్యాధుల్లో ఒకటైన టీబీ వ్యాధిని బీసీజీ వ్యాక్సిన్‌తో నివారించ వచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. గురువారం స్థానిక రామారావుకాలని అర్బన్ హెల్త్‌సెంటర్ వద్ద బీసీజీ వాక్సిన్‌ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి వారి సమ్మతితో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కాగా ప్రతి గురువారం ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వైద్య ఆరోగ్యసిబ్బంది ప్రజలకు బీసీజీ వ్యాక్సిన్‌లు వేస్తారన్నారు. ఈ వ్యాక్సిన్‌పై ప్రజలు ఎటువంటి అపోహలు లేకుండా వేసుకోవ చ్చన్నారు. డాక్టర్ విష్ణువర్దన్‌రెడ్డి మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్‌తో ఎలాంటి దుష్పరిమాణాలు(రియాక్షన్స్) రావన్నారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సిబ్బంది ప్రభాకర్, సుశీల, వనజ, తరుణ్, సునీత, 104 నోడల్ అఫీసర్ ప్రవీణ్, కమర్‌వల్లి పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో 270 మందికి బీసీజీ వ్యాక్సిన్

తంబళ్లపల్లె, మే 16: క్షయ నియంత్రణ చర్యల్లో భాగంగా వేస్తున్న బీసీజీ టీకాలను తంబళ్లపల్లె మండల వ్యాప్తంగా 270 మందికి వేసినట్లు వైద్యాధికారి మునికుమార్ తెలిపారు. గురువారం కోసువారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని 12 ఆరోగ్య ఉపకేంద్రాలలో వైద్యాధికారి అనుపమ ఆధ్వర్యంలో బీసీజీ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ..18 ఏళ్లు పూరైన వారు డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు, పొగాకు వాడుతున్న వారు, గతంలో టీబీ భారిన పడిన వారు, 60 సంవత్సరాలు దాటిన వారంతా టీకా వేసుకోవాలన్నారు. బీసీజీ టీకాలు అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సిమ్రాన్, ఏఎన్ఎం కుతీజా, ఆశకార్యకర్తలు గీత, రసూల్‌బి, భారతి తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణ కోసమే బీసీజీ టీకా

వాల్మీకిపురం, మే 16: టీబీ నివారణ కోసం వాల్మీకిపురం యూనిట్ వ్యాప్తంగా వయోజనసులకు బీసీజీ టీకా వేయడం జరిగిందని టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు తెలిపారు. టీబీ (క్షయ) ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 16వ తేదీ నుంచి ప్రతి గురువారం 18ఏళ్లు దాటిన వారిని గుర్తించి వారికి, మధుమేహ వ్యాధిగ్రస్తులకి, ధూమపానం చేయువారికి, టీబీ మందులు వాడి తగ్గిన వారికి, టీబీ వ్యాధి కుటుంబ సభ్యులకి, 60ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికీ బీసీజీ టీకాను ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ప్రతి గురువారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఉచిత టీకా వినియోగించుకొని టీబీ రహిత దేశంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటీ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫైరోజాబేగం, సీనియర్ సూపర్‌వైజర్ మురళి, నాగిరెడ్డి, ల్యాబ్‌టెక్నీషియన్ కృష్ణమూర్తి, వాయల్పాడు గ్రామ సచివాలయం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అమృత, ఏఎన్ఎం సరోజ, ఆశ కార్యకర్తలు స్వరూప, అమరావతి, నగిరిమడుగు ఆస్పత్రి సూపర్‌వైజర్‌లు నెకబీబీ శారద, రామాంజులు పాల్గొన్నారు.

కలకడలో: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి బీసీజీ టీకాలను వేసి లక్ష్యాలను పూర్తి చేయాలని వైద్యాధికారి డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన ఆసుపత్రి పరిధిలోని దేవళపల్లె జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. క్షయ వ్యాధి బాధితుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకిపురంలో బీసీజీ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది




టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి

చంద్రబాబును కలిసిన టీడీపీ యువనేత

పెద్దతిప్పసముద్రం మే 16 : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్ర బాబు నాయుడును తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ యువనాయకుడు ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి తనయుడు మనోజ్‌జయంత్‌రెడ్డి గురువారం కలిశారు. షిరిడీలో చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు కండువా కప్పి సన్మానించారు. అనంతరం చంద్ర బాబునాయుడు తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఎన్నికల పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా తెలుగు రైతు జన్మదిన వేడుకలు



శాలువతో రవిప్రకాశ్‌నాయుడుని సన్మానిస్తున్న నాయకులు

కలకడ, మే 16:మండలానికి చెందిన తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాశ్‌నాయుడు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలకడ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే పలువురు నాయకులు ఆయనను కలిసి శాలువ, పూల మాలలుతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్, విశ్వనాథ్, త్యాగరాజు, బట్టా శేఖర్‌నాయుడు, అలీ, జాఫర్, జిలానీ, నౌషాద్, రామాంజులు, తారకేశ్వర, ప్రసాద్, రాజేష్, ప్రభాకర్, నాగార్జున్‌నాయుడు, సుదర్శన్‌నాయుడు, గణేష్‌నాయుడు, ఈశ్వర్, నవీన్, శ్రీనివాసులనాయుడు, డి.ఎస్.నాయుడు, శ్రీధర్, జీవన్‌లు పాల్గొన్నారు.

19న సత్యనారాయణ స్వామి కల్యాణం



సత్యనారాయణ స్వామి కల్యాణం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయకమిటీ సభ్యులు .

మదనపల్లి అర్బన్, మే 16 : మండలంలోని చిప్పిలి గ్రామంలో వెలసిన సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 19వ తేదీన సత్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవాన్ని అత్యంతవైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు కె.అమరనాథ్ తెలిపారు. గురువారం ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం పోస్టరును ఆలయకమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా ఆల యంలో సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సత్యనారాయణ స్వామి కళ్యాణోత్సవంలో చిప్పిలి గ్రామస్తులే కాకుండా పరిసరి ప్రాంత గ్రామస్థులు కూడా పాల్గొంటా రని వారు తెలిపారు. కల్యాణం అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ కార్యదర్శి వైద్యం రామకృష్ణ, ట్రెజరర్ వి. దివాకర్, కమిటీసభ్యులు అచ్చింతల కుమారస్వామి, శివశంకర్, అన్నసాగరం ప్రభాకర్, అర్చకుడు పణితేజా, తదితరులు పాల్గొన్నారు.

21న లక్ష్మినరసింహస్వామి కల్యాణోత్సవం

లక్కిరెడ్డిపల్లె, మే16: మండలంలోని రవీంద్రనగర్ వద్ద వెలిసిన లక్ష్మినరసింహస్వామి ఆలయంలో 21న లక్ష్మినరసింహస్వామి 30వ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు లక్ష్మిన రసింహ స్వామి కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు లక్ష్మినరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం అత్యంత వైభవంగా 30వ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. మధ్యాహ్నం లల్లూయాదవ్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లో స్వాముల వారి ఊరేగింపులో కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కోనంపేటలో పంచమ వేద మహాభారతం యజ్ఞం

లక్కిరెడ్డిపల్లె, మే16: ు కోనంపేట గ్రామంలో ఈ నెల 17 నుంచి జూన్ 3వ తేదీ వరక పంచమ వేద మహాభారత వేద మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు కార్యనిర్వాహకులు తెలిపారు. 17న ధ్వజారోహణం, 21న బలిబండి ఊరేగింపు, 23న ద్రౌపదీకల్యాణం, 27న అర్జున తపస్సు, జూన్ 1న ఇలావతుని వధ, 2వ తేదీన దుర్యోధన వధ ఈ ఘట్టంలో భాగంలో ప్రతి రోజు హరికథ కాలక్షేపం నిర్వహిస్తారు. హరికథా భాగవతారిణి హైమావతి, రేడియో ఆర్టిస్టు ప్రతిరోజు హరికథా కాలక్షేపం అలాగే శ్రీవెంకటేశ్వర నాట్యమండలి పీలేరు వారిచే రాత్రివేళల్లో మహాభాగవతం ఘట్టంలోని కొన్ని కార్యక్రమాలు ప్రతిరోజు మధ్యాహ్నం వేళలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కోనంపేట రామాలయం వద్ద మహాయజ్ఞ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు.

వేసవి సెలవుల్లో విహారయాత్రకు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మే 16: వేసవిసెలవుల్లో విహారయాత్రకు మదనపల్లె ఆర్టీసీ నుంచి బస్సులు నడుపుతున్నట్లు వన్‌డిపో మేనేజరు మూరే వెంకట రమణారెడ్డి తెలిపారు. మదనపల్లె వన్ డిపోనుంచి ఊటీ, మైసూరు ప్రదేశాలకు విహారయాత్ర నిమిత్యం సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. ఈ బస్సులు 20వ తేదీన రాత్రి 9 గంటలకు మదనపల్లెలో బయలుదేరి 21వ తేదీన ఉయం ఊటీ చేరుకుని, 22వ తేదీ ఉదయం అక్కడి నుంచి బయలుదేరి మైసూరు చేరుకుని అక్కడ ప్రదేశాలను దర్శించిన పిదప సాయంత్రం బృందావన్ గార్డెన్స్‌లో లైటింగ్ షో తర్వాత బయలుదేరి 23వ తేదీన ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. పోనురాను ఒక్కరికి ఛార్జీ రూ. 2800మాత్రమే అన్నారు. యాత్ర ప్రియులు, ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు ఈ ఫోన్ నెంబర్లకు 7382875034, 7382876658, 9441646104, 9440249483 సంప్రదించాలని ఆయన కోరారు.

ఆరుగురు నిందితుల అరెస్టు

రాయచోటి టౌన్, మే 16: పట్టణంలోని గాలివీడు రోడ్డులోని లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వందాడి వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేసిన ఆరుగురిని రాయచోటి అర్బన్ పోలీసులు గురువారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో వైసీపీకి చెందిన వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఈనెల 15 రాత్రి వెంకటేశ్వర్లు ఇంటిపైన కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఇంటి ప్రహరీ గోడకు ఉన్న సోలార్‌వైర్లను కత్తిరించి ఇంట్లోకి ప్రవేశించి అక్కడ ఉన్న జీపు అద్దాలు, కుర్చీలు, లైట్లు పగులకొట్టారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు రాయచోటి డీఎస్పీ రామచంద్రారావు, సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో దాడికి పాల్పడిన వారిలో ఆరుగురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితులను 14 రోజుల రిమాండ్ విధించారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు తెలిపారు.

మదనపల్లె ఎగువబోంపల్లెలో అత్యధికంగా 94.02శాతం పోలింగ్

- అత్యల్పంగా 136వ బూత్‌లో 49.36 శాతం పోలింగ్
- 88 పోలింగ్ కేంద్రాల్లో 80శాతం పైగా పోలింగ్
- 81 పోలింగ్ కేంద్రాల్లో 70శాతం పైగా పోలింగ్

మదనపల్లె టౌన్, మే 16: మదనపల్లె నియోజవకర్గంలోని 250 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నడూ లేని విధంగా రామసముద్రం మండలం ఎగువబోంపల్లెలో 94.02శాతం పోలింగ్ జరిగింది. అదే విధంగా మదనపల్లె పట్టణంలోని 136వ పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 49.36శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో ఓటర్లు చైతన్యంగా వచ్చి ఓట్లు వేశారు. కాని పట్టణ ఓటర్లు ఓటు వేసేందుకు ఆసక్తి కనపరచలేదని, గణాంకాలే చెబుతున్నాయి. మొత్తం మీద నియోజకవర్గంలోని 259 పోలింగ్ కేంద్రాల్లో 6 పోలింగ్ కేంద్రాల్లో 90శాతం పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే 88 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు 80శాతం పైగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. 81 పోలింగ్ కేంద్రాల్లో 70శాతం పైగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేశారు. ఇదిలా వుంటే ఓ ప్రధాన పార్టీ తాము నియోజకవర్గ ఓటర్లలో 85శాతం ఓటర్లను కలిశామని చెబు తోంది కాని, మదనపల్లె నియోజకవర్గంలో 75.11శాతం మాత్రమే పోలింగ్ జరగడంతో ఆ పార్టీ ప్రధాన నాయకుల్లో అలజడి మొదలైంది. తమ టార్గెట్ 85 మంది ఓటర్లను రప్పించి పోలింగ్ నిర్వహించాలని రేయింబవళ్లు బయట వ్యక్తులను తీసుకొచ్చి ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులు ఇచ్చినా, వలంటీర్లను పరుగులు పెట్టించినా 10శాతం ఓట్లు తక్కువ పడ్డాయి. దీంతో ఈ పది శాతానికి అయిన ఖర్చు, శ్రమ ఎక్కడికి పోయిందని ఆరాలు తీస్తున్నారు. కొం దరు ద్వితీయశ్రేణి నాయకులు ఈ ఖర్చులను తమ ఖాతాలో వేసుకుని జల్సా చేస్తున్నారని సమాచారం.

28 నుంచి కోర్టులో గంగమ్మ జాతర



కోర్టులో గంగమ్మ జాతర వివరాలు వెల్లడిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, మే 16: స్థానిక కోర్టులో వెలసిన కోర్టులో గంగమ్మ జాతరను ఈ నెల 28, 29 తేదీల్లో అత్యంతవైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం ఆలయంలో నిర్వహించిన మీడియా స మావేశంలో ఆలయకమిటీ కార్యదర్శి మార్పురి ప్రభాకర్‌నాయుడు మాట్లాడు తూ కోర్టులో గంగమ్మ జాతరకు సంబంధించి గురువారం చాటింపు వేశా మని తెలిపారు. ఈ నెల 28న అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠ రాత్రి తిరు ణాల, 29వ తేదీన పగలు తిరుణాల అంగరంగవైభవంగా నిర్వహిస్తామన్నా రు. అదే రోజు రాత్రి వివిధ రకాల కళాకారులతో బళ్లారి డ్రమ్స్, చెక్కభ జనలతో ఊరేగింపుగా తర లివెళ్లి అమ్మవారిని జలజిలో కలిపే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలి పారు. అదేవిధంగా జాతర పోస్టర్‌ను ఆలయంలో ఆలయకమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అమ్మవారి జాతరలో అధిక సంఖ్యలో పాల్గొనే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప పేర్కొన్నారు. కార్యక్రమాలను ఆలయకమిటీ ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి మార్పురి ప్రభాకర్ నాయుడు ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు, జోలెపాళ్యం కరుణా కర్‌నాయుడు, ఆలయ ప్రత్యేక ఆహ్వానితుడు జోలెపాళ్యం భవానీప్రసాద్, మార్పురి మహేష్, మార్పురి విక్కి, జోలెపాళెం దేవేంద్ర(చిన్ని), బోయపాటి శ్రీనివాసులునాయుడు, ఉపాండ్ల కృష్ణకుమారి, తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

మద్దెమ్మ ఆలయానికి రూ.లక్ష సాయం



విరాళం అందజేస్తున్న కర్ణాటక వాసులు

ములకలచెరువు, మే 16: మండ లంలోని చౌడసముద్రం సమీపం లో వెలసిన మద్దెమ్మ ఆలయానికి గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులకు గానూ కర్ణాటక రాష్ట్రం రాగుట్టహళ్ళికి చెందిన శ్రీరామరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమ ణి లలితమ్మ, కుమారులు హర్ష, రాహుల్, మనవడు రాజారెడ్డి, మనవరాలు సాయిరారూబిలు రూ.లక్ష విరాళాన్ని ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి, కార్యనిర్వాహకుడు పుట్టాశేఖర్‌గుప్తాకు అందజేశారు. గతంలో కూడా వారు ఆలయంలో నాగులు, నవగ్రహాల ఏర్పాటు, ప్రతిష్ఠకు రూ.4లక్షలు సహాయం అందజేశారు. అలాగే 2022 డిసెంబర్ 8వతేదీన కూడా ఆలయం ఆవరణలో వంటశాల నిర్మాణానికి రూ.80వేలు విరాళం ఇచ్చారు.

23న ధర్మపథంలో పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, మే 16: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథంలో 23న (గురువారం) పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు.. ఉదయం ఆలయంలోని మూలవర్లకు అభిషేకాలు, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రత వేడుకలు, అభయాంజనేయ స్వామివారి కి వడమాల, తోమాల సేవలు ఆకుపూజ, విశేష అలంకరణలు నడుమ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం మే 16 : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో దత్తాత్రేయ స్వామి వారికి పంచా మృతాభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. గురు వారం ఆధ్యాత్మికవేత్త ననగ రం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కర్ణాటక రాష్ట్రా నికి చెందిన వేదపండితులు శేషాచలం శర్మా, వేణుగోపాల్ శర్మా, సత్యనారాయణ శర్మా, నటరాజ్ శర్మా లచే దత్తాత్రేయ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమం లో పీటీఎంతో పాటు సమీప గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి కలశారాధన



ఆలయంలో కలశారాధన నిర్వహిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, మే 16: స్థానిక కదిరి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి వారి ఆరాధన ఉత్సావాల్లో భాగంగా గురువారం ఆలయంలో కలశారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణాచారి, నవయుగ స్వర్ణకారుల సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ అప్పినిపల్లె భాస్కరాచారిలు నిర్వహించారు. గురువారం ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, 9గంటలకు నాగదేవతల ఆరాధన, స్వామివార్లకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో కలశారాధనతోపాటు హోమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మహామంగలహారతి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులతోపాటు విశ్వబ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.